Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## బాబు రాజకీయ అంతానికి...
# పంతం పట్టిన ప్రధాని



**చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయడానికి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి కంటే కూడా ప్రధాని నరేంద్ర మోడీనే ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నాడు. ఎన్నికలకు ముందు ప్రధాని సీట్లో నరేంద్ర మోడీని లేకుండా చేస్తానని బాబు బీరాలు పలికాడు. అది నెరవేరలేదుగాని మోడీ గట్టిగా దృష్టిపెడితే కొద్దిరోజుల్లోనే బాబుకు ప్రతిపక్ష నేత హోదా మిగలదు.**

**2019** ఎన్నికల తర్వాత ప్రధాన మంత్రి సీటులో నరేంద్ర మోడీని లేకుండా చేస్తానని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఛాలెంజ్ చేశాడు. ఇందుకోసం అడ్డమైన దారులన్నీ పట్టాడు. అన్ని రాష్ట్రాలకు పోయాడు. కొందరి కాళ్ళు, కొందరి చేతులు, ఏది దొరికితే అది పట్టు కున్నాడు. ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఏకం చేసి, వాటన్నింటినీ కాంగ్రెస్ గూటికి చేర్చి బీజేపీని దెబ్బతీయాలని భావించాడు. తనతో పెట్టుకుంటే ఎలాంటి గతిపడుతుందో ప్రధాని నరేంద్ర మోడీకి చూపించా లనుకున్నాడు. అందుకోసం అన్నీ విడిచిపెట్టి చివరకు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం తెలిసిందే! ఇన్ని చేసినా చంద్రబాబు కోరిక నెరవేరలేదు. గతంకంటే ఇంకొంచెం ఎక్కువ సీట్లతో నరేంద్ర మోడీ మళ్ళీ ప్రధాన మంత్రి అయ్యాడు. కేంద్రంలో చక్రం తిప్పుదామని తెగ ఉబలాటపడ్డ చంద్రబాబుకు కేవలం మూడంటే మూడే లోక్‌సభ సీట్లు దక్కాయి.

నరేంద్ర మోడీని ప్రధాని పదవి నుండి దించాలన్న లక్ష్యం నెరవేర లేదు... కాని ప్రధాని నరేంద్రమోడీ మాత్రం చంద్రబాబుకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా చేయాలనే పంతాన్ని మాత్రం నెగ్గించుకునేటట్లున్నాడు.

నరేంద్ర మోడీ తన రాజకీయ చరిత్రలో క్షమించలేని వ్యక్తుల్లో చంద్ర బాబు ఒకడు. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో ఆ రాష్ట్ర సీఎంగా వున్న నరేంద్ర మోడీని వెంటనే ముఖ్యమంత్రి పదవి నుండి దించేయాలని, ఉరిశిక్షవేసినా తప్పులేదని మాట్లాడింది చంద్రబాబే! ఆరోజే చంద్రబాబు మాటలు ఆయన మనసులో పడ్డాయి.

(మిగతా 11వ పేజీలో)

# ప్రమాదకరంగా పవన్



### అత్యాచారం కేసుపై అతివాగుడు
### మతపరమైన వ్యాఖ్యలతో మంటలు

**ఒక రోడ్డుమీదున్న పిచ్చోడు ఏదేదో వాగుతుంటాడు. దారినిపోయే వాళ్ళు అతను ఏం వాగుతున్నా పట్టించుకోరు. ఎందుకంటే అతనికి మతిస్థిమితం లేదు... పాపం పిచ్చో డులే అనుకుని పోతుంటారు.**

పాతికపైగా సినిమాలు, లక్షల మంది అభిమానులు, ఒక సొంత పార్టీ, రెండు తెలుగు రాష్ట్రాలలో పేరుమోసిన సినిమా కుటుంబంలో వున్న వ్యక్తి... ఆ పిచ్చోడికంటే దారు ణంగా మాట్లాడుతుంటే ఏమనుకో వాలి? అతడిని కూడా పిచ్చోడని వది లేయాలా? మదమెక్కి మాట్లాడుతు న్నాడనుకుని బుద్ధి చెప్పాలా?

తెలుగు రాష్ట్రాలలో పవన్ కళ్యాణ్ అనే క్యారక్టర్ ఇప్పుడు ప్రమాదకరంగా మారుతోంది. నోటికేది వస్తే అది మాట్లాడుతున్న అతని వాగుడు వల్ల విద్వేషాలు, వైషమ్యాలు చోటుచేసుకునే ప్రమాదం వుంది. అతని మాటలు, చేష్టలతో సమాజానికే ప్రమాదకరంగా మారుతున్నాడు.

హైదరాబాద్ శివార్లలో శంషా బాద్ అవుటర్‌రింగ్‌రోడ్డు వద్ద జరిగిన 'దిశ' అత్యాచారం, హత్య దారుణాన్ని ప్రపంచమంతా ఖండించింది.

(మిగతా 11వ పేజీలో)



## జిల్లా ఎస్పీగా...
# భాస్కర భూషణ్
## మంగళగిరికి రస్తోగి



(వివరాలు 10వ పేజీలో)

# ఆనంకు అందలం



### డిసిసిబి చైర్మెన్‌గా విజయ
### ఆనం ఇంటి నుండి మూడో చైర్మెన్

**ముక్కుసూటిగా మాట్లాడు తాడు... ఉన్నది ఉన్నట్లు మాట్లాడు తాడు... కుండ బద్ధలు కొట్టినట్లు మాట్లాడుతాడు... ఆనం కుటుంబంలో ఈ పేరున్న నాయకుడు ఆనం విజయ కుమార్‌రెడ్డి.**

కపటం తెలియని వ్యక్తిగా ఆయనకు పేరుంది. రాజకీయాలలలో వుంటు న్నప్పటికీ అందులోని తంత్రాలు, కుతంత్రాలకు ఆయన దూరంగా వుం టాడు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక తన సోదరు లతో సహా రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంగ్రెస్ నాయకులంతా కూడా తెలుగు దేశంలోకి చేరుతున్న తరుణంలో, వారందరికీ భిన్నంగా, మా కుటుంబా నికి వైయస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ప్రాధాన్యతకు ఆయన ఋణం తీర్చు కోవాల్సిన అవసరముందంటూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షాన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిన ఏకైక నాయకుడు ఆనం విజయ. అంతేకాదు... 2017లో జరిగిన స్థానిక శాసనమండలి ఎన్నికలలో నెల్లూరుజిల్లా శాసనమండలి నియో జకవర్గం నుండి పోటీ చేయడానికి వైసిపిలో ఎవ్వరూ ధైర్యం చేయని,

(మిగతా 10వ పేజీలో)



### 18 లక్షల విలువజేసే..
# ఎర్రచందనం పట్టివేత

• ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి అధికారులు ఎంత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నా, ఈ అక్రమరవాణా మాత్రం ఎక్కడో ఒకచోట జరిగిపోతూనే ఉంది. పోలీసులు ఇటీవలే ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 18 లక్షల రూపాయల విలువజేసే 20ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకటగిరి సిఐ అన్వర్‌బాషా ఆ వివరాలు తెలియజేశారు. రాపూరు మండల పరిధిలోని వెలుగొండ అడవుల్లోంచి ఎర్రచందనం చెట్లను నరికి వాటిని అక్రమంగా ఇతరప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకునేందుకు స్మగ్లర్లు పథకం వేశారు. చిట్వేలి మార్గంలోంచి ఈ స్మగ్లింగ్ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు పెద్దఎత్తున వెలుగొండ అడవుల్లో గాలింపు జరిపి అక్కడ ఒక వాగు వద్ద ఎర్రచందనం దుంగలతో ఉన్న ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరు వైఎస్ఆర్ జిల్లా చిట్వేలి మండలం అనుంపల్లి గ్రామానికి చెందిన వారని, వారి పేర్లు వెంకటయ్య, హరిబాబు అని సిఐ తెలిపారు. వీరు పంగిలి, వెంకటగిరి మీదుగా ఎర్రచందనాన్ని చెన్నైకి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు వెంకటగిరికి చెందిన శివ, పంగిలికి చెందిన వెంకటేష్, చెన్నైకి చెందిన రవి అనే వ్యక్తులు ఈ స్మగ్లింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరే కాక వీరితోపాటు మరికొందరు కూడా ఈ స్మగ్లింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోందని, అరెస్టయిన స్మగ్లర్ల కాల్‌డేటా నుంచి మిగిలిన వారిని కూడా గుర్తించి వారిని కూడా అరెస్ట్‌చేస్తామని చెప్పారు. ఎర్రచందనం అక్రమరవాణా కేసుల్లో పట్టుబడిన వారిపై పి.డి యాక్ట్ కింద కేసు నమోదవుతుందని, వారి ఆస్తులను కూడా జప్తు చేస్తామని తెలిపారు. స్మగ్లర్లను అరెస్ట్ చేసిన రాపూరు ఎస్ఐలు కోటిరెడ్డి, స్వప్నతో పాటు పోలీసులను ఆయన అభినందించారు. ఎర్రచందనం అక్రమరవాణా ఎక్కడైనా జరుగుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. అలాంటివారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, సమాచారం తెలిపినందుకు పారితోషికం అందజేస్తామని ఆయన తెలిపారు.

### చరిత్ర గ్రంథాలు..
# భావితరాలకు వెలుగుదారులు

— ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య


గ్రంథావిష్కరణ చేస్తున్న మోపూరు వేణుగోపాలయ్య, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, రచయిత మాచవోలు

చరిత్రను ఎప్పుడూ విస్మరించరాదని, భావితరాల వారి కోసం చరిత్ర గ్రంథాలను పరిరక్షించుకోవాలని, మన సాహిత్యాన్ని మనం ఎల్లవేళలా కాపాడుకుంటూ ఉండాలని ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య అన్నారు. గతనెల 30న నెల్లూరులోని వర్ధమాన సమాజం గ్రంథాలయంలో డాక్టర్ మాచవోలు శివరామప్రసాద్ రచించిన 'పూండ్ల రామకృష్ణయ్య లేఖలు' గ్రంథం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అలనాటి ప్రముఖ పత్రికా సంపాదకుడు పూండ్ల రామకృష్ణయ్య నేతృత్వంలో నెల్లూరు నుంచి 1885-1904 సంవత్సరాల్లో 'శ్రీ అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక వెలువడిందని, సుమారు 19 సంవత్సరాల పాటు ఈ పత్రిక సాహిత్యాభిమానుల విశేషాదరణ పొందిందని అన్నారు. సంపాదకునిగా, గ్రంథ ప్రచురణకర్తగా పూండ్ల రామకృష్ణయ్య తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన రాసిన లేఖలను ఎంతో కష్టపడి సేకరించి పుస్తకంగా ముద్రించడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు. సర్వోదయ కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధిపతి డాక్టర్ మాచవోలు శివరామప్రసాద్ గతంలో పూండ్ల రామకృష్ణయ్య సాహిత్యసేవపై పరిశోధన సాగించి పిహెచ్‌డి పట్టా పొందారన్నారు. భావితరాలకు వెలుగుబాటలు చూపే ఇలాంటి చరిత్ర గ్రంథాలు ఎంతో అపూర్వమైనవని కొనియాడారు. ఈ గ్రంథావిష్కరణ సభలో వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, డా. కాళిదాసు పురుషోత్తం తదితరులు పాల్గొని రచయిత డా. మాచవోలును అభినందించారు.

### యువజనోత్సవాల్లో....
# డీకేడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ

విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో గతనెల 29,30 తేదీలలో నిర్వహించిన యువజనోత్సవాల్లో డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు ఏడు విభాగాల్లో బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మస్తానయ్య విద్యార్థినులను అభినందించి మాట్లాడుతూ విద్యార్థినులు జానపద నృత్యం, గేయాల్లో ప్రథమ స్థానం, సంప్రదాయ నృత్యం, సంగీతం, వక్తృత్వ పోటీలలో ద్వితీయ స్థానం, లలిత గేయాలు, ముగ్గుల పోటీల్లో తృతీయ స్థానం సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారన్నారు. కల్చరల్ కమిటీ కన్వీనర్ రాజేశ్వరి, సభ్యులు పద్మప్రియ, సుధారాణి, అపర్ణాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇక వేణుగోపాలుడు... ఇఓ పర్యవేక్షణలోకి



నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధ శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం తొలిసారిగా దేవదాయశాఖ ఇఓ పర్యవేక్షణలోకి వచ్చింది. దేవస్థానం తొలి కార్యనిర్వహణాధికారిగా ఈనెల 3న జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఈ దేవస్థానం దాదాపు 60 ఏళ్ళ క్రితమే దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చినా నిర్వహణ వ్యవహారాలన్నీ వ్యవస్థాపక ధర్మకర్తల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. పలు రాజకీయ కారణాలతో ఇఓ లను నియమించలేదు. ఆస్తులు, ఆదాయాలు ఉన్నా అప్పుల్లోకి వెళ్ళడం, అర్చకుల జీతాల బకాయిలు, దేవస్థానం అభివృద్ధి చేసేందుకు దేవస్థానం భూములను విక్రయించే ప్రయత్నాలు చేయడంతో వివాదం ఏర్పడింది. దీంతో విచారణ అనంతరం దేవాదాయశాఖ కమిషనర్ ఇఓను నియమించారు. గతంలో రెండుసార్లు ఇఓలను నియమించినా పలు కారణాలతో బాధ్యతలు చేపట్టకపోవడంతో జిల్లా సహాయ కమిషనర్‌నే బాధ్యతలు చేపట్టాలని రాష్ట్ర కమిషనర్ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు.

సింహపురి సమాచారం

### బహిరంగంగా
# మద్యం తాగితే మటాష్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి వళ్ళు తెలీకుండా అనేక నేరాలకు, ప్రమాదాలకు కారణమవుతున్న మద్యం తాగే బాబులపై జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ మద్యసేవనంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది జూన్ నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకు 3,107మందిని అదుపులోకి తీసుకుని వారిపై 1888 కేసులు నమోదు చేశారు. గతనెలలో 554 కేసులు నమోదు చేసి 791మందిని కోర్టుకు హాజరు పరి చారు. వారిలో కొంతమందికి జరిమానా, మరికొంత మందికి జైలు శిక్ష విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యసేవనం, అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 100కు గాని లేదా వాట్సప్ నెంబర్ 9390777727కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

### పూలు కోసుకుంటున్న మహిళ మెడలో
# గొలుసు చోరీ

మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులు అపహరించుకువెళ్తున్న దుండగుల దుష్కృత్యాలకు అంతే ఉండడం లేదు. గత నెల 30 వేకువన నాయుడుపేటలోని రాజగోపాలపురంలో చెంచమ్మ అనే గృహిణి వేకువనే లేచి దేవునికి పూజ చేసేందుకు ఇంటి ముందున్న చెట్టువద్ద పూలు కోసుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి వెనుకగా వచ్చి ఆమె నోరునొక్కి మెడలోని బంగారు సరుడును లాక్కెళ్ళాడు. ఆమె ఆ హఠాత్సంఘటన నుంచి తేరుకున్నాక కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే దుండగుడు ఉడాయించాడు. స్థానికులు వెంబడించే ప్రయత్నం చేసినా దొరకలేదు. బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇలాంటి దుండగుల ఆట కట్టించకుంటే ఈ అరాచకాలు మరింత పెచ్చుమీరిపోతాయి.

# రెడ్‌క్రాస్‌లో జీవితకాల సభ్యులుగా చేరండి

అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మక స్వచ్ఛంద సంస్థ రెడ్‌క్రాస్ సంస్థ. దాదాపు 12 అనుబంధ ప్రాజెక్టులతో రాష్ట్రంలోనే మేటిగా ఉంటూ వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థలో జీవితకాల సభ్యులుగా చేరాలని సొసైటీ అడ్‌హాక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఏ.వి సుబ్రహ్మణ్యం కోరుతున్నారు. కార్యాలయం పనిచేసే సమయాలలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటలు వరకు అందుబాటులో ఉంటుందన్నారు. సభ్యత్వ రుసుము రూ.1020, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకుని రావాలన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఏపి.ఓఆర్ జి వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ సభ్యత్వం నమోదు చేసుకోవచ్చన్నారు. కావలి, సూళ్ళూరు పేట, గూడూరు, వెంకటగిరి, కలువాయి, ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, వివిదవలూరు, కొడవలూరు శాఖలలోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. సేవాతత్పరత కలిగిన వ్యక్తులు రెడ్ క్రాస్ సభ్యులుగా చేరాలని, ఇతర వివరాలకు 0861-2323482లో సంప్రదించాలని కోరారు.

### 8న రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జీవిత సర్వసభ్య సమావేశం ఈనెల 8 న ఆదివారం ఉదయం11 గంటలకు నెల్లూరులోని కస్తూరిదేవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అడ్‌హాక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఏవి సుబ్రహ్మణ్యం తెలిపారు. సభ్యులందరూ తమ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు. రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు ఉత్తర్వులు మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నవశకం సర్వే ద్వారా..
# అర్హులకు ప్రభుత్వ పథకాలు

వైయస్సార్ నవశకం సర్వే ద్వారా అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ శీనానాయక్ తెలిపారు. ఈనెల 4 న డీఆర్డీఏ సమావేశ మందిరంలో వైయస్సార్ నవశకంపై వివిధ శాఖల అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 3,45,922 పింఛన్లు ఉన్నాయని, అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని స్వయంసహాయక గ్రూపులకు రూ.53.12కోట్ల వడ్డీ లేని రుణాలను వారి బ్యాంకు ఖాతాల్లో ఈనెల 21 వ తేదీలోగా జమ చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ జీవపుత్రకుమార్ మాట్లాడుతూ వైయస్సార్ విద్య దీవెన, వైయస్సార్ వసతిదీవెన పథకాలకు 50,064 మంది లబ్దిదారులను గుర్తించామన్నారు. డీఇఓ జనార్ధనాచార్యులు మాట్లాడుతూ వైయస్సార్ అమ్మఒడి పథకానికి సంబంధించి 42,934 మంది లబ్దిదారులను గుర్తించామన్నారు. డీఎస్ఓ బాలకృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో 9,13,921 బియ్యం కార్డులు ఉన్నాయన్నారు. 6,39,670 బియ్యం కార్డులను పరిశీలించి వివరాలు అప్ లోడు చేశామన్నారు. బీసీ సంక్షేమాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ వైయస్సార్ కాపునేస్తం, రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు ప్రభుత్వం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో 5,25,336 మందిని సర్వే చేశామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, డీఆర్డీఏ ఉద్యోగులు, బీమా మిత్రులు పాల్గొన్నారు.

# స్టార్టర్ల దొంగ దొరికాడు

వింజమూరు పరిసర పొలాల్లో విద్యుత్‌మోటార్లకు సంబంధించిన స్టార్టర్లను దొంగిలించుకుపోతున్న వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతనివద్ద నుంచి సుమారు 45వేల రూపాయల విలువైన 14 స్టార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. విద్యుత్ మోటార్ల స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయన్న రైతుల ఫిర్యాదుతో ప్రత్యేకనిఘా ఏర్పాటుచేసి నిందితుడిని పట్టుకున్నామని వింజమూరు ఎస్ఐ బాజిరెడ్డి తెలిపారు.

# పార్లమెంటులో బలంగా నెల్లూరు గళం



## • లోక్‌సభలో ఏపిఆర్

## • రాజ్యసభలో విపిఆర్



**ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాలు మొదలైంది తడవు... ప్రతిరోజూ ఇద్దరు ఎంపీల గళం వినిపిస్తోంది. పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. సమాధానాలు రాబడుతోంది. ఆ ఇద్దరు ఎంపీలు కూడా నెల్లూరువాళ్ళే కావడం గమనార్హం. ఒకరు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కాగా, మరొకరు నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి. విపిఆర్ రాజ్యసభలో, ఏపిఆర్ లోక్‌సభలో ప్రతిరోజూ పలు అంశాలపై తమ ప్రశ్నాస్త్రాలను సంధిస్తున్నారు. పలు సమస్యలపై పూర్తి స్థాయి వివరాలు రాబడుతున్నారు. వీళ్ళిద్దరూ పార్లమెంటులో తొలిసారే అడుగుపెట్టినప్పటికీ, ప్రశ్నలు సంధించడంలో సీనియర్ పార్లమెంటేరియన్‌లను మించిపోయారు.**

ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న పురుషులకంటే మహిళలకు వేతనాల చెల్లింపులో తేడాలపై ఏమైనా ఫిర్యాదులు అందాయా?..ఆ తేడాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?..అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించగా, అందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న మహిళల వేతనాల పట్ల ఎలాంటి వివక్షత లేదని, ఈ వేతనాల చెల్లింపుల్లో తేడా గురించి తమకు ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఈ పథకం కింద ఎక్కువమంది మహిళలు పాల్గొనేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, మహిళలకు పనివేళల్లో సౌలభ్యం కూడా కల్పిస్తున్నామని, వేతనాల్లో ఎలాంటి వివక్షతకు గురికాకుండా మహిళల కోసం ప్రత్యేక నిబంధనలు ఏర్పాటు చేశామని వివరించారు. 2018-19లో ఈ పథకంలో మహిళల నిష్పత్తి 54:57గా ఉందని అంటూ దీనిని మరింత పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు.

### గ్రామీణ ఆదాయ వృద్ధికి కేంద్రపథకాలతో ఊతం

దేశీయ ఆర్థికవృద్ధి మందగమనాన్ని అధిగమించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అసంఘటిత రంగాల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ ఆదాల ఈనెల 4న లోక్‌సభలో ప్రశ్నించగా, అందుకు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖల మంత్రి పీయూష్‌గోయల్ సమాధానం చెప్తూ ఆర్థికవృద్ధి ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న ఆర్థిక మందగమనంతో పాటు దేశంలోనూ కొంత నిరాశాజనకంగా మారిన ఆర్థిక వృద్ధికి చేయూతనిచ్చేందుకు కేంద్రప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వాటి అమలుకు కృషి చేస్తోందన్నారు.

### ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో నిబంధనల మేరకే మందుల కొనుగోళ్ళు

హైదరాబాద్‌లో ఇటీవల ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో చోటుచేసుకున్న కుంభకోణాల గురించి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ కుంభకోణాల్లో ఎవరినైనా అరెస్ట్ చేశారా?..ఈ ఆసుపత్రుల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారని కూడా ప్రశ్నించారు. అందుకు కేంద్ర కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ సమాధానం చెప్తూ, దేశంలో ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో నిబంధనల మేరకే మందుల కొనుగోళ్ళు చేస్తున్నామన్నారు. ఒక అధికారిని అరెస్ట్ చేసినట్లు తమకు సమాచారం అందిందన్నారు.

వివిధ నిబంధనల పేరుతో పేద, బడుగు వర్గాల విద్యార్థులను చదువులకు దూరం చేయొద్దని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 4వ తేదీ పార్లమెంటులో జీరో హావర్‌లో ఆయన మాట్లాడుతూ నాక్, ఎన్‌బిఏ గుర్తింపు పొందిన విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఋణాలను పరిమితం చేసే మార్గదర్శకాలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. పేద మరియు వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు వారి కుటుంబ అభ్యున్నతి కోసం ఉన్నత విద్యను అభ్యసించేందుకు అందుబాటులో వున్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. విద్యార్థులు ఇప్పుడు చదువుతున్న విద్యా సంస్థతో సంబంధం లేకుండా ఎడ్యుకేషన్ లోన్స్ పొందుతున్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయం, లేదా యుజిసి గుర్తింపు వుంటే సరిపోయేది. ఇటీవల మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ విద్యా రుణాలకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. నాక్, ఎన్‌బిఏ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, జాతీయ ప్రాధాన్యత కలిగిన సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే రుణాలు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. ఈ కాలేజీలలో చదివే విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ తొందరగా పొందుతారని, త్వరగా రుణాలు చెల్లిస్తారని చెప్పారు. ఇది ఒక వింత వాదన అని వేమిరెడ్డి కొట్టిపారేశాడు. దీనితో తాను ఏకీభవించనని అంటూ దేశంలో 1056 నాక్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు వున్నప్పటికీ నూటికి నూరు శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్ సాధించిన కళాశాల ఒక్కటీ లేదన్నారు. కాబట్టి ఈ నిబంధనలను సవరించి పేదవిద్యార్థులందరికీ విద్యా రుణాలు లభించేలా చర్యలు తీసుకోవాలని వేమిరెడ్డి కోరారు.

### 'భారత్‌మాల' పై చర్చ

2వ తేదీ జరిగిన చర్చలో 'భారత్ మాల' క్రింద ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన రహదారులపై కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని ప్రశ్నించి ఆయన నుండి వివరాలు రాబట్టారు. అలాగే 3వ తేదీ జరిగిన రాజ్యసభ చర్చలో ఆయన పసిపిల్లల పౌష్టికాహార లోపాన్ని ఎత్తి చూపాడు. 28 శాతం బ్రాకెట్ కింద వస్తువులపై జిఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించాడు. 5వ తేదీ జరిగిన చర్చలో ఆయన శిశుమరణాలపై, శిశువులను రక్షించడానికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీని ప్రశ్నించాడు.



# మరో ప్రయోగానికి షార్ ముస్తాబు

పిఎస్ఎల్‌వి - సి47ను విజయవంతంగా ప్రయోగించిన రెండు వారాలకే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. దీని కోసం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్)ను ముస్తాబు చేసింది. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 3.25 గంటలకు షార్ నుండి పిఎస్ ఎల్‌వి-సి48ను ప్రయోగించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా స్వదేశీ ఉపగ్రహం రీశాట్-2బితో పాటు విదేశాలకు చెందిన 9 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. మొదటి లాంచింగ్ ప్యాడ్‌ను ఇటీవల ఆధునీక రించారు. దీని తర్వాత ఇదే తొలి ప్రయోగం కాబోతోంది.

## వెంకయ్య చొరవతో...

# ఉప్పు భూములకు విముక్తి



ఉపరాష్ట్రపతి, నెల్లూరీయుడైన యం.వెంకయ్యనాయుడు చొరవతో దాదాపు 12ఏళ్ళుగా పరిష్కారం కాకుండా వున్న కృష్ణపట్నం పోర్టు పరిధిలోని 758.39 ఎకరాల ఉప్పు భూములకు విముక్తి లభించింది. వెంకయ్యనాయుడు చూపించిన శ్రద్ధ మూలంగా ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వ పోర్టుల విభాగానికి బదిలీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈమేరకు భూమి బదలాయింపుకు అనుమతినిస్తూ కేంద్ర రైల్వే, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ సాల్ట్ కమిషనర్ ఆర్గనైజేషన్‌కు లేఖ వ్రాశాడు. ఈ లేఖ ప్రతిని వారు ఉపరాష్ట్రపతి కార్యాలయానికి కూడా పంపించారు.

కృష్ణపట్నం పోర్టు పరిధిలో అభివృద్ధికి ఈ భూముల బదలాయింపు ఎంతో అవసరం. వెంకయ్యనాయుడు గతంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వున్నప్పుడే ఈ సమస్యపై దృష్టి పెట్టారు. 2017 జూలైలోనే ఈ విషయంపై ఆయన కేంద్ర పరిశ్రమలమంత్రికి లేఖ వ్రాశారు. అప్పుడు వెంకయ్య వ్రాసిన లేఖను ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిశ్రమల శాఖ మంత్రి ఉప్పు భూముల బదలాయింపుకు ఆదేశించాడు. ఈ ఉప్పు భూములకు డిపిఐఐటి నిర్ధారించిన ప్రకారం మార్కెట్ ధరను చెల్లించి, నిబంధనలు, షరతులకు లోబడి ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సివుంటుంది.

# రైతాంగ ప్రయోజనాలను కాపాడండి

## - తెలుగుగంగ అధికారులకు ఆనం సూచన



ప్రస్తుత ఇరిగేషన్ సీజన్‌లో తెలుగుగంగ ప్రాజెక్ట్ కాలువల క్రింద చివరి ఆయకట్టు రైతాంగానికి సాగు నీటి సరఫరా విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి సూచించాడు. 5వతేదీ ఆయన నెల్లూరులోని తెలుగు గంగ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యాడు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు మండలాల పరిధిలోని చివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీళ్ళు అందించే విషయంలో అప్రమత్తంగా వుండాలన్నాడు. ఎస్ఎస్ కెనాల్ పునరుద్ధరణ కోసం, కండలేరు రిజర్వాయర్ గ్రౌండింగ్ పనులు, సంక్రాంతిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, వెలుగోను, చాగణంరాజుపాలెం లిఫ్ట్ పునరుద్ధరణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. అల్తూరుపాడు లిఫ్ట్ ద్వారా మేర్లపాక వరకు జరుగుతున్న పంపింగ్ వల్ల చిత్తూరుజిల్లా అవసరాలకు నీటి తరలింపు జరుగుతుందే తప్ప వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు దీనివల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నాడు. ఎస్ఎస్ కెనాల్‌ను పునరుద్ధరిస్తేనే వెంకటగిరి నియోజకవర్గానికి ఉపయోగపడుతుందన్నాడు.

ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్.ఇ హరినారాయణరెడ్డి, ఇ.ఇ.లు, డిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

# వి.ఆర్. పీజీ కాలేజీని తనిఖీ చేసిన జేసీ

నెల్లూరులోని విఆర్ కళాశాల ప్రత్యేక అధికారి మరియు జాయింట్ కలెక్టర్ అయిన పి.వినోద్‌కుమార్ ఈ నెల 5వ తేదీన విఆర్ పి.జి కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కళాశాలలో ఎంతమంది విద్యార్థులు వున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట విఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ తనూజ, నెల్లూరు అర్బన్ తహశీల్దార్ కూడా వున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ వినోద్

## 'ప్రభా'తం

# చట్టాలు మార్చాల్సిందే!

హైదరాబాద్ ఔటర్‌రింగ్‌రోడ్డు పక్కన నలుగురు మహిళలు మద్యం తాగుతున్నారు. వాళ్ళు అన్ని విధాలా బరితెగించిన వాళ్ళు. వాళ్ళకు లేని వ్యసనాలంటూ లేవు. రోజూ ఆ దారినేపోయే పెళ్ళికాని ఓ అందమైన యువ డాక్టర్‌పై వాళ్ళ కన్నుపడింది. ఒకరోజు అతడిని అటకాయించి రోడ్డుపక్కనే వున్న పొదల్లోకి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేసి, అతను ప్రాణాలతో బయటపడితే తాము ఎక్కడ దొరికిపోతామోనని గొంతు నొక్కి చంపేశారు. ఆ తర్వాత పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగలబెట్టేశారు.

గత కొన్ని దశాబ్దాల చరిత్రలో ఇలాంటి స్టోరీని పత్రికలలో చదవగలిగామా? టీవీలలో చూడగలిగామా? రేడియోలలో వినగలిగామా? లేదు... ఇది సాధ్యం కాదు. ఎందుకంటే సృష్టిలోనే భగవంతుడు స్త్రీకి అన్యాయం చేశాడు. శారీరక దారుఢ్యంలో ఆమెను మగవాడి కంటే కాస్త తక్కువ స్థాయిలో వుంచాడు. అదే వారి పాలిట శాపంగా మారుతోంది. అదే వారి పాలిట నరకమవుతోంది.

ప్రపంచంలోని 194 దేశాలలో స్త్రీని దేవతగా పూజించే ఏకైక దేశం భారతదేశం. ఇక్కడ చెట్లకు, పుట్లకు, జీవనదులకు వాళ్ళ పేర్లే! ఏం లాభం... స్త్రీని దేవతగా కాకుండా స్త్రీగానే భావించి చూసే దేశాలలో వారిపై ఎలాంటి దారుణాలు జరగడం లేదు. స్త్రీలను స్త్రీలుగానే చూస్తున్నారు. కాని స్త్రీని దేవతగా చూసే దేశంలోనే అకృత్యాలకు అడ్డు లేకుండా పోతోంది. ఆడది ఒంటరిగా పోవాలంటేనే భయపడాల్సివస్తోంది.

హైదరాబాద్ శివార్లలో జరిగిన 'దిశ' అత్యాచారం, హత్య సంఘటన మన సమాజానికి ఏం చెబుతోంది. అంతర్జాతీయ నగర స్థాయిని అందుకున్న హైదరాబాద్ నగర శివార్లలో నలుగురు కామాంధుల కిరాతకానికి బలైపోయిన 'దిశ' దారుణ సంఘటన ద్వారా మన ప్రభుత్వాలు ఏం తెలుసుకోబోతున్నాయి. ఏదైనా ఇలాంటి సంఘటన జరిగినప్పుడు దేశ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించడం, ధర్నాలు చేయడం, కొద్ది రోజులకే ఈ సంఘటన మరుగునపడిపోవడం... తర్వాత ఇంకో సంఘటన... 130కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో ఇలాంటి దారుణ సంఘటనలకు కొదవే వుండదు. దేశమంతటా అన్ని రాష్ట్రాల డేటాను పరిశీలించి చూస్తే లైంగిక వేధింపుల కేసులు ప్రతిరోజూ వేల సంఖ్యలోనే నమోదవుతుంటాయి. ఆరు నెలల పసికందు నుండి అరవైఏళ్ల వృద్ధ మహిళల వరకు కామాంధులు వదలడం లేదంటే లోపం వ్యక్తిలో వుందా? వ్యవస్థలో వుందా? మనిషి పుట్టింది కేవలం కామవాంఛలు తీర్చుకోవడానికేనా? వాటిని తీర్చుకోవాలంటే మనిషి పశువుగా మారాల్సిందేనా?

భారతదేశంలో మహిళలపై అత్యాచారాల పరంపర నిత్యకృత్యంగానే వుంది. ఢిల్లీలో నిర్భయ అత్యాచారం ఘటన దేశాన్ని కుదిపేయడం తెలిసిందే! ఈ సంఘటన తర్వాతే కేంద్రం నిర్భయ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. నిర్భయ కేసులో నిందితులకు కోర్టు ఉరిశిక్ష విధించినా ఇంతవరకు అమలు జరగలేదు. నిర్భయ అత్యాచార ఘటనలో ఓ మైనర్ నిందితుడున్నాడు. ఆ యువతిపట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించింది అతడే అయినప్పటికీ మైనర్ చట్టం ఆ క్రూరుడిని కాపాడింది. మిగతావాళ్లకు ఉరిశిక్ష విధించినా ఇంతవరకు అమలు కాలేదు. వారిలో ఒక నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కేంద్రం నిర్భయ చట్టం తెచ్చిన తర్వాతేమన్నా అత్యాచారాలు ఆగాయా? వేధింపులు తగ్గాయా? ఏమీ లేదు. వాటి పాటికవి జరిగిపోతున్నాయి. చట్టాలను, శిక్షలను కఠినంగా అమలు చేయనన్ని రోజులు ఇలాంటి ఘోరాలు జరుగుతూనే వుంటాయి.

మిగతా నేరాలన్నీ ఒకెత్తు... మహిళలపై అత్యాచారాలు, హత్య ఒకెత్తు. సాధారణ కేసులతో పాటు వీటిని పరిగణించకూడదు. ఇలాంటి దారుణాలు జరిగినప్పుడు కేసు విచారణ, శిక్ష అమలు ఒకట్రెండు నెలల్లో జరిగిపోవాలి. ముఖ్యంగా ఇలాంటి ఘోరాలకు పాల్పడే నిందితులకు మరణశిక్షలే విధించాలి. ఇలాంటి వాళ్ళు బ్రతికుండి సమాజాన్ని ఉద్ధరించేదేమీ వుండదు... ఇలాంటి వాళ్ళు భూమికి భారం. ఎంత తొందరగా వారిని భూమ్మీద లేకుండా చేస్తే అంత మంచిది.

> ప్రపంచంలోని 194 దేశాలలో స్త్రీని దేవతగా పూజించే ఏకైక దేశం భారతదేశం. ఇక్కడ చెట్లకు, పుట్లకు, జీవనదులకు వాళ్ల పేర్లే! ఏం లాభం... స్త్రీని దేవతగా కాకుండా స్త్రీగానే భావించి చూసే దేశాలలో వారిపై ఎలాంటి దారుణాలు జరగడం లేదు. స్త్రీలను స్త్రీలుగానే చూస్తున్నారు. కాని స్త్రీని దేవతగా చూసే దేశంలోనే అకృత్యాలకు అడ్డు లేకుండా పోతోంది. ఆడది ఒంటరిగా పోవాలంటేనే భయపడాల్సివస్తోంది. మన చట్టాలు, న్యాయప్రక్రియలో మార్పు వచ్చి నిందితులకు త్వరగా కఠిన శిక్షలు అమలు చేయకపోతే, ప్రజలే తిరగబడి దుండగులను శిక్షించే రోజులు ఎంతో దూరంలో లేవు.

ఈరోజు 'దిశ' ఘటనలో నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని ప్రజలంతా డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ అన్నది చట్ట విరుద్ధమైనదని తెలిసినా కూడా ప్రజలు ఆ డిమాండ్ చేస్తున్నారంటే కారణం... చట్టాలపై నమ్మకం కోల్పోవడమే.

మన చట్టాలు, న్యాయ వ్యవస్థల పట్ల ప్రజల నమ్మకం ఎలా వుందంటే... నిందితులను కోర్టుల్లో ప్రవేశపెడతారు, జడ్జి రిమాండ్‌కు పంపుతాడు, వాళ్ళు బెయిల్‌పై తిరిగొస్తారు, కేసు విచారణ సుదీర్ఘకాలం వాయిదాలు పడుతుంది... సాక్ష్యాలు బలహీనపడతాయి, చివరకు నేర నిరూపణ కాక నిందితులు నిర్దోషులుగా బయటపడతారు. ఇదీ మన వ్యవస్థలపై ప్రజలకున్న నమ్మకం. అందుకే కోర్టు ద్వారాకంటే ఎన్‌కౌంటర్ ద్వారా వారిని శిక్షించాలని కోరుతున్నారు.

గతంలో వరంగల్‌లో ఇద్దరు విద్యార్థినులపై యాసిడ్ దాడి చేసిన ముగ్గురు యువకులను దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడు పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. 'దిశ' ఘటనలోనూ ప్రజలు అలాంటి తీర్పునే కోరుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరిగినప్పుడు ఎటువంటివారైనా కోర్టు వేసే శిక్షలకంటే కూడా ఇలాంటి సత్వర శిక్షలనే కోరుకుంటారు. ఇలాంటి సంఘటనలు జరిగే కొద్ది ప్రజలు వాటిని అరికట్టడానికి ఆటవిక శిక్షలే ప్రధాన మార్గమని భావిస్తున్నారు.

మన చట్టాలు, న్యాయప్రక్రియలో మార్పు వచ్చి నిందితులకు త్వరగా కఠిన శిక్షలు అమలు చేయకపోతే, ప్రజలే తిరగబడి దుండగులను శిక్షించే రోజులు ఎంతోదూరంలో లేవు.

### నేత్రపర్వం.. అయ్యప్పస్వామి
## పూజా మహోత్సవం

నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో గతనెల 30న స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండల పూజా మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి వేడుకగా శీవేలి ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీ స్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షుడు పి.టి రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు గడ్డం రత్నయ్య, సుజాతమ్మ, భావన, మేఘన ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. మురళీకృష్ణ హోటల్ నిర్వాహకులు వీరిశెట్టి హజరత్ బాబు, మాజీ కార్పొరేటర్ మేకల నరేంద్ర రెడ్డి, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, హైటెక్ ఫార్మా అధినేత రమణారెడ్డి, హరిప్రసాద్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### 14న రాచపాలి రత్నావళి
## గ్రంథావిష్కరణ

రత్నమ్మ ఛారిటబుల్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో రాచపాలి రత్నావళి గ్రంథావిష్కరణ ఈనెల 14 న నెల్లూరు టౌన్ హాలులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాచపాళెం రఘు తెలిపారు. పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని కల్యాణం

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఈనెల 2న స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ఆర్జిత కల్యాణోత్సవాన్ని ఎంతో వేడుకగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసన్ శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కల్యాణానికి బి.సురేష్, విమల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ వేమూరి గోపి మాట్లాడుతూ శ్రీవారికి ఆర్జిత కల్యాణం చేయించాలనుకునే భక్తులు 1516 రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ వేడుకలో వేదపండితులు చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంతపేట ఆంజనేయస్వామికి వార్షిక మహాకుంభాభిషేకం

నెల్లూరు సంతపేటలో వెలసియున్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈనెల1న దేవస్థానం పునర్నిర్మాణం జరిగి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, మూలవర్లకు పంచామృతాభిషేకాలు, కలశపూజ, పూర్ణాహుతి అనంతరం మహా కుంభాభిషేకాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆంజనేయ భక్తమండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి నిర్వహించిన పూలంగిసేవ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఇఒ రామకృష్ణ పాల్గొన్నారు.






## కసబ్‌లాగా మేపుతారా?

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన 'దిశ'పై అత్యాచారం, హత్యకేసు నిందితులను జైలులో పెట్టి ఉగ్రవాది అజ్మల్ కసబ్‌లాగా మేపదలుచుకున్నారా? ఇలాంటి తోడేళ్లు సమాజానికి అవసరమా? ఇంకొక్క నిముషమైనా వీళ్లకు బ్రతికే అర్హత వుందా? ఇలాంటి నీచులను ఉరి కూడా తీయకూడదు. 'దిశ' ఏ చోట అయితే అత్యంత పాశవికంగా హత్య చేశారో అక్కడే వీళ్ళ నలుగురిని పెట్రోల్ పోసి తగలబెట్టాలి. ఈ దృశ్యాలను అన్ని టీవీలలో ప్రసారం చెయ్యాలి. ఇలాంటి నీచులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, రేపు చట్టాలలో లొసుగులను ఆసరా చేసుకుని బెయిల్ మీద బయటకు వస్తారు. ఈ సంఘటనపై సీరియస్ తగ్గిపోతుంది. ఈ నీచులు మళ్లీ ఇలాంటి అకృత్యాలకే ఒడికడుతుంటారు. కాబట్టి ఇలాంటి నేరాలకు పాల్పడిన నిందితులకు వారంరోజుల్లోపే మరణశిక్షలు అమలు చేయాలి. అప్పుడే న్యాయవ్యవస్థపై నమ్మకముంటుంది.

**డి.సౌజన్య, నెల్లూరు.**

## దమ్మున్న లీడర్ వై.యస్.

తెలంగాణ ప్రజలకు స్వర్గీయ వై.యస్.రాజశేఖరరెడ్డి మరోసారి గుర్తుకువచ్చాడు. దమ్మున్న లీడర్‌కు చేవచచ్చిన లీడర్‌కు తేడా ఏంటో తెలుసుకున్నారు. వై.యస్. సీఎంగా వుండగా వరంగల్ పట్టణంలో ఇద్దరు యువతులపై యాసిడ్ దాడి జరిగింది. వైయస్ వెంటనే స్పందించారు. అంతేకాదు, ఆ దాడికి పాల్పడిన నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. 'దిశ' కేసులో కూడా కేసీఆర్ ప్రభుత్వం నుండి తెలంగాణ ప్రజలు అలాంటి ప్రతిస్పందనే ఆశించారు. కాని ఈ సంఘటనపై కేసీఆర్ అంత సీరియస్‌గా స్పందించక పోవడం ఒకెత్తయితే, అసలు సానుభూతి కూడా వ్యక్తం చేయకపోవడం తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి రగిలించింది. వాళ్లంతా కూడా ఇలాంటి సమయంలో వైయస్సే వుండుంటే ఆ నిందితులు ఇంకా ప్రాణాలతో వుండేవారా అని అనుకుంటున్నారు.

**డి.మహేష్, హైదరాబాద్.**

## కులం పేరుతో సినిమాలు నిషేధించాలి

కులం పేరుతో తీసే ఏ సినిమానైనా నిషేధించాలి. ఇప్పటికే రాష్ట్రాలు, దేశం కులాల కుంపట్లో కాలుతున్నాయి. ఏ రాష్ట్రంలో చూసినా కుల రాజకీయాలే! రెండు ప్రధాన కులాలను ప్రస్తావిస్తూ దర్శకుడు రాంగోపాల్‌వర్మ తీసిన 'కమ్మ రాజ్యంలో కడపరెడ్లు' సినిమాను హైకోర్టు నిలిపివేయడం అభినందనీయమే. కులాల మధ్య అంతరాలు పోవాలి. ప్రజలంతా కులాలు మతాలు మరిచిపోయే రోజులు రావాలి. ఇలాంటి సినిమాలతో కులాల మధ్య చిచ్చు రేగుతుంది.

**– పి.నందకిషోర్, నెల్లూరు.**



- ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్ కృషితో 46 మండలాలకు నీటి వసతి

# జిల్లాలో జల నిధులు

జిల్లాలోని 46 మండలాలలోని 37 లక్షలమంది ప్రజలకు తాగునీరు అందించే ఒక బృహత్తర ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ చొరవతో 'జలనిధి' ఏర్పాటుకు నిధులు మంజూరు కాబోతున్నాయి. జిల్లాలోని 46 మండలాలలోగల అన్ని గ్రామాలకు పైప్‌లైన్‌ల ద్వారా మంచినీరు అందించడంతో పాటు పరిశ్రమల అవసరాలకు కూడా నీటిని అందించే విధంగా 3200 కోట్ల రూపాయలతో వాటర్‌గ్రిడ్‌కు రూపకల్పన జరుగుతోంది.

నెల్లూరు నగరానికి ఇప్పటికే సంగం బ్యారేజ్ నుండి తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ పనులు చేపట్టడం తెలిసిందే! వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి, సూళ్లూరుపేట, నెల్లూరురూరల్ నియోజకవర్గాల పరిధిలోని 23మండలాలలో వున్న దాదాపు 1900 గ్రామాలకు అలాగే వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాలకు కండలేరు రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందించనున్నారు. దీనికి 1387 కోట్లు అంచనా వ్యయంగా వుంటుంది.

సంగం ఆనకట్ట నుండి కావలి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల పరిధిలోని 10 మండలాలలోని 600 కుగ్రామాలకు 517.27 కోట్ల అంచనా వ్యయంతో తాగునీరు అందిస్తారు. సోమశిల రిజర్వాయర్ నుండి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని 400గ్రామాలకు 535.92కోట్ల వ్యయంతో తాగునీటి వసతి కల్పిస్తారు. పెన్నా పరివాహక ప్రాంతంలో 110 కోట్ల అంచనా వ్యయంతో బోర్లు వేయడం ద్వారా కలువాయి, చేజర్ల మండలాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. చిన్నక్రాక ఇరిగేషన్ రిజర్వాయర్ నుండి 34కోట్ల అంచనా వ్యయంతో జలదంకి మండలానికి తాగునీటి వసతి ఏర్పడనుంది. మరో 25కోట్ల అంచనా వ్యయంతో ఆత్మకూరు మండల పరిధిలోని పెన్నా పరివాహక గ్రామాలకు తాగునీటి వసతి కల్పిస్తారు.

దీనికి సంబంధించి డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) తయారు చేయించి అనుమతి కోసం ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రభుత్వం అనుమతి లభిస్తే 2020 జనవరిలోనే జలనిధి పనికి శంకుస్థాపన జరిగే అవకాశాలు లేకపోలేదు.

# మాయమవుతున్న మైదానాలు

**కంప్యూటర్లే క్రీడా వేదికలౌతున్నాయి**

**ఆటలు కనుమరుగవుతున్నాయి**

**ప్రైవేట్ పాఠశాలల్లో ఆటస్థలాలు మృగ్యమౌతున్నాయి**



***ఈ కాలంలో పిల్లలకు ఆటలంటే ఏం తెలుసు... పబ్‌జీ గేమ్స్, కంప్యూటర్ గేమ్స్.. పుస్తకాలు పక్కనపెడితే వాళ్ళు ఆడే ఆటలు ఇవే! ఈ ఆటలతో శారీరక దారుఢ్యం లభిస్తుందా? మానసిక వికాసం మెరుగుపడుతుందా? జంక్ ఫుడ్ తినడం, ఒళ్లు కదలకుండా టీవీల ముందు, అవి లేకుంటే కంప్యూటర్‌ల ముందు కూర్చుని గేమ్స్ ఆడడం... అసలు క్రీడామైదానాలనేవి వుంటాయనే స్పృహ విద్యార్థులకు లేకుండా పోతోంది.***

50 అంకణాల స్థలంలో 5 అంతస్థుల భవనాలు... వాటిలో ఎల్‌కెజి నుండి పదివరకు తరగతులు... మళ్లీ వాటిలో సెక్షన్‌లు... వెయ్యిమంది దాకా విద్యార్థులు. ఆడుకోవడానికి అంకణం స్థలం కూడా వుండదు, అందుకు అసలు సమయం కూడా వుండదు. ఉదయం 9గంటలకు చదువుల పేరుతో బాదడం మొదలుపెడితే సాయంత్రం 6గంటల దాకా ఆపరు. ఇక ఆడుకునేదెప్పుడు?

ప్రభుత్వ బడులనే చూద్దాం... ఒక్కో జడ్పీ హైస్కూల్ కనీసం 4ఎకరాల నుండి పది, పదిహేను ఎకరాల విస్తీర్ణంలో వుంటాయి. అన్ని క్రీడలకు సంబంధించిన కోర్టులుంటాయి. ప్రతిరోజూ పిఇటి క్లాసు వుంటుంది. ప్రతి సంవత్సరం క్రీడాపోటీలు జరుగుతుంటాయి. కాని ఇప్పుడు ఈ క్రీడా మైదానాలను ఉపయోగించుకోవడానికి విద్యార్థులే వుండరు.

రాను రాను ఆ క్రీడామైదానాలు రూపు కోల్పోతున్నాయి. కార్పొరేట్ చదువుల ముసుగులో ఆటలాడే విద్యార్థులు తగ్గిపోతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పోటీతత్వం వల్ల క్రీడలపై శ్రద్ధ తగ్గిపోతోంది. దీనివల్లే క్రీడామైదానాల నిర్వహణ సరిగా వుండడం లేదు. పాఠశాలల్లో క్రీడా మైదానాలన్నీ కూడా వాకర్స్‌కు లేదంటే వాణిజ్య వ్యాపారాల ప్రదర్శనలకు, అదీ లేకుంటే మతపరమైన కార్యక్రమాలకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడున్న చదువుల పరిస్థితి ఎలా వుందంటే.. విద్యార్థులకు అసలు క్రీడా మైదానాలు అవసరమే లేదన్నట్లుగా మారడంతో, వున్న క్రీడా మైదానాలను కూడా నిర్వీర్యం చేస్తున్నారు.

### పేదల కోసం..

# ప్రభుత్వ భూములను గుర్తించండి

పేదలకు నివేశనస్థలాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వ భూములను గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ నెల 2న కలెక్టరేట్ నుంచి ఆయన రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల్లో ప్రభుత్వ భూములు ఉంటే భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. భూసేకరణ చేయాలంటే ప్రభుత్వానికి కోట్లాది రూపాయల భారం పడుతుందని, అందువల్ల అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని తెలిపారు. భూస్వాముల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వభూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వైఎస్సార్ నవశకం సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాలోకి బిఎంఆర్?

- త్వరలో చేరొచ్చని ఊహాగానాలు



ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాలో ఒక మోస్తరు నాయకుల వలసలు ఇంకా మొదలు కాలేదు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి బీజేపీలో చేరడమే ఒక స్థాయి చేరిక. పలు నియోజకవర్గాలలో గ్రామస్థాయి, డివిజన్ స్థాయి నాయకులు వైసిపిలో చేరుతున్నారంతే!

తాజాగా జిల్లా స్థాయి నాయకులు కూడా వైసిపిలో చేరడానికి రంగం సిద్ధమవుతోంది. అందులో మొదటగా వినిపిస్తున్న పేరు బీద మస్తాన్‌రావు. జిల్లాలో బిసివర్గాలకు చెందిన బలమైన నాయకుడు. తెలుగుదేశంలో సీనియర్ కూడా. త్వరలోనే ఆయన తెలుగుదేశాన్ని వీడి వైసిపిలో చేరనున్నాడనే వూహాగానాలు వినిపిస్తున్నాయి. బిఎంఆర్ వైసిపిలో చేరడంలో ఎంపి విజయసాయి రెడ్డిది కీలకపాత్ర లాగుంది. విజయసాయిరెడ్డికి బిఎంఆర్ ఎంతో సన్నిహితుడు. ఇద్దరూ ఆడిటింగ్ రంగం నుండి వచ్చినవాళ్లే! రాజకీయాలు పక్కనపెడితే ఇరువురి మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. ఇటీవల ఆక్వాకు సంబంధించిన సదస్సులో సీఎం జగన్‌ను బిఎంఆర్ కలిసినప్పటి నుండి కూడా ఆయన పార్టీ మారుతాడనే ప్రచారం వూపందుకుంది.

మొదటినుండి తెలుగుదేశం సానుభూతిపరుడైన బిఎంఆర్ 2000లో జడ్పీటీసీ ఎన్నికల ద్వారా ప్రత్యక్ష రాజకీయ తెరపైకి వచ్చాడు. అప్పుడు బోగోలు జడ్పీటీసీగా గెలుపొందాడు. 2004 ఎన్నికలప్పుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోకి వెళ్లాడు. అయితే పక్కరోజే టిడిపిలోకి రిటర్న్ అయ్యాడు. అంతేకాదు, ఆ ఎన్నికల్లో అల్లూరు అసెంబ్లీ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి పరాజయం చెందాడు. 2009లో మళ్లీ కావలి అసెంబ్లీ నుండి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించి తొలిసారి శాసనసభ్యుడయ్యాడు. 2014 ఎన్నికల్లో అదే కావలి నుండి మళ్లీ ఓడిపోయాడు. 2012లో నెల్లూరు లోక్‌సభకు జరిగిన ఉపఎన్నికల్లో తెలుగుదేశం తరఫున పోటీచేసి ఘోరపరాజయం పొందాడు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కావలి అసెంబ్లీ సీటును కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి వదలుకుని నెల్లూరు లోక్‌సభ నుండి ఆయన పోటీ చేశాడు. ఇక్కడా ఓటమి తప్పలేదు. 2014 నుండి 2019ల మధ్య రాజధాని కమిటీలో ఆయన సభ్యుడిగా పని చేశాడు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ వివాదాల జోలికిపోలేదు. సౌమ్యుడిగా పేరుంది. రాజకీయ అవకాశాల దృష్ట్యా ఆయన పార్టీ మారతాడనే ప్రచారం జరుగుతోంది. అయితే అదే సమయంలో ఆయన సోదరుడైన బీద రవిచంద్ర మాత్రం తెలుగుదేశంలోనే కొనసాగే అవకాశాలున్నాయి.

# మహిళలూ!.. అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

**- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**



మహిళలూ అధైర్యపడొద్దు... మీకు అండగా ఉంటాం. మీ రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం, మీ భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి స్పష్టం చేశారు.

ఈనెల 2న ఆయన నెల్లూరులోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు అభద్రతగా ఉన్న జనసంచారం లేని ప్రాంతాలు, శివారు ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరిగే ఇలాంటి ప్రాంతాలను గుర్తించి నిరంతరం పోలీసు గస్తీ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. మహిళలు ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా సమయస్ఫూర్తితో అవాంతరాలను అధిగమించేందుకు ప్రయత్నించాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ముందుగా కుటుంబసభ్యులకు ఫోన్ చేసేకన్నా పోలీస్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలన్నారు. పోలీసులకు ఉపయోగకరంగా ఉండేందుకు త్వరితగతిన ఘటనాస్థలాన్ని చేరుకునేందుకు లొకేషన్‌ను షేర్ చేయాలని తెలిపారు. మహిళలందరూ మొబైల్ ఫోన్లలో పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను ఫాస్ట్ డయల్ నంబర్లుగా సేవ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

**100 కు కాల్ చేయండి :**

ఆపదలో ఉన్న సమయాల్లో మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 100కు డయల్ చేస్తే మూడు, నాలుగు నిమిషాల్లోనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుంటారని, గ్రామీణ ప్రాంతాల్లో పది, పదిహేను నిమిషాల్లోనే పోలీసులు మీకు అందుబాటులోకి వస్తారని, 24 గంటలూ డయల్ 100 సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా అత్యవసర హెల్ప్ లైన్ 112, 181 ఉమెన్ హెల్ప్‌లైన్‌లను కూడా మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు సైబర్‌మిత్ర నంబర్ 91212 11100 అందుబాటులో ఉంటుందని తెలిపారు.



# పెన్నాపై ఇంకో వంతెన కావాల్సిందే!



నెల్లూరు కబుర్లు

నెల్లూరు నగరానికి ఉత్తరంవైపున వున్న పెన్నానదిపై ఒక వంతెన వుంది. ఈ వంతెన కట్టి ఆరు దశాబ్దాలకుపైనే అయ్యింది. ఈ వంతెన కట్టక ముందు పెన్నావారధిపై వాహన రాకపోకలుండేవి. ఈ వంతెన వచ్చాక కావలి వైపు నుండి వచ్చే అన్ని వాహనాలు కూడా ఈ వంతెన మీదుగానే నగరంలోకి ప్రవేశించాలి. 2004లో జాతీయ రహదారి నాలుగులైన్ల విస్తరణలో భాగంగా పెన్నానదిపై మరో వంతెన నిర్మించడం జరిగింది. అయితే అది బైపాస్‌గా ఉపయోగపడుతుంది. నగరంలోకి ప్రవేశించే వాహనాలు చాలా తక్కువగానే కొత్త వంతెన మీదుగా వచ్చి చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు లేదా గొలగమూడి రోడ్డు జంక్షన్ వద్ద నగరంలోకి ప్రవేశిస్తుంటాయి. కావలి, ఆత్మకూరు రోడ్ల వైపు నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు, విద్యాసంస్థల బస్సులు, ఇతర వాహనాలన్నీ కూడా పాత వంతెన మీదుగానే నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వంతెన చాలా ఇరుకుగా వుంది. వంతెన మధ్యలో ఏదన్నా వాహనం మరమ్మత్తులకు గురై ఆగిపోతే ట్రాఫిక్ స్థంభించిపోతుంది. అటు ఇటు కిలోమీటర్లపైనే వాహనాలు బారులు తీరి ఆగిపోతున్నాయి. పెరిగిన వాహనాలకు ఈ వంతెన సరిపోవడం లేదు. పాత వంతెన పక్కనే మరో వంతెన నిర్మాణం చేపట్టి, రావడానికి ఒక దానిని, పోవడానికి ఒకదానిని అమలు చేస్తే ఇక్కడ ట్రాఫిక్ నరకం తప్పుతుంది.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కెవిఎన్ఆర్ విద్యార్థులు

నెల్లూరు జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు నెల్లూరు బీవీ నగర్‌లోని కెవిఎన్ఆర్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 2న విద్యార్థులను ఆయన అభినందించారు.

## స్కేటింగ్ కమిటీలో ఈశ్వర్

ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన జి.ఈశ్వర్‌ను ఎంపిక చేశారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జడ్.శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి.వెంకటేశ్వర్లులు ఒక ప్రకటనలో ఈశ్వర్‌ను అభినందించారు.

## అనాథలకు.. 'కిడ్జ్' చేయూత

నెల్లూరులోని 'వాత్సల్య' అనాథాశ్రమంలోని విద్యార్థులు, వృద్ధులకు స్థానిక 'కిడ్జ్' స్కూల్ విద్యార్థులు గతనెల 30న నిత్యావసర సరుకులు వితరణగా అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నాగమల్లయ్య మాట్లాడుతూ, విద్యార్థులు సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, సమాజసేవాభావంతో మెలిగి మంచి విద్యార్థులుగా రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అల్తాఫ్, ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

ఎయిడ్స్‌ను పూర్తిగా నియంత్రించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, ప్రభుత్వాధికారులు సమన్వయంతో పనిచేయాలని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్-2 కమలకుమారి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 1న గాంధీబొమ్మ సెంటర్ నుండి వీఆర్‌సీ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెట్నెల్ సీఈఓ సుస్మితారెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




## జాతీయస్థాయికి ఎంపికైన 'రెయిన్‌బో' సైన్స్ నమూనా

నెల్లూరు రూరల్ మండలంలోని కలివెలపాలెంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనా జాతీయస్థాయికి ఎంపికైంది. ఇక్కడ చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు హరిసంపత్ బేబి, అశ్రితలు ఈ నమూనా రూపొందించినట్లు పాఠశాల అకడమిక్ డెవలపర్ మాలతీవాసుదేవన్ పేర్కొన్నారు. ఈనెల 2న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను ఆమె అభినందించారు.

నవంబర్ 29, 30 తేదీల్లో చెన్నైలో సిబిఎస్ఇ రీజియన్‌స్థాయి సైన్స్ ప్రదర్శన నిర్వహించారని, ఆంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి మొత్తం 165 ప్రదర్శనలు రాగా, 'సైంటిఫిక్ సొల్యూషన్స్ ఫర్ ఛాలెంజెస్ ఇన్ లైఫ్' అనే అంశంపై రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో రెయిన్‌బో విద్యార్థులు ప్రదర్శించిన నమూనా జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికైందని ఆమె వివరించారు. పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ హరితారెడ్డి, సురేఖారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని ఆ నమూనాను రూపొందించిన విద్యార్థులను అభినందించారు.

## కస్తూరిదేవి డ్రాయింగ్ టీచర్‌కు ఆత్మీయ వీడ్కోలు

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న కస్తూరిదేవి హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న దామెర్ల స్వర్ణలత గతనెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ జెవి రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వనజ మాట్లాడుతూ చిత్రలేఖనంలో స్వర్ణలత జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు కూడా అందుకున్నారని, పాఠశాలకు ఆమె చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. అనంతరం స్వర్ణలతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యే శర్మ, సాయిలక్ష్మి, రమణమ్మ, లీలమ్మ, ముంతాజ్‌బేగం, దేవసేన తదితరులు పాల్గొన్నారు.

## కూలిపోనున్న పౌరసరఫరాల భవనం

నెల్లూరు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల భవనం కూల్చివేతకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ భవనం అంత పాతదేమీ కాదు. రెండేళ్ల క్రితం ఈ భవనంలో అగ్ని ప్రమాదం జరిగి పలు కీలక ఫైళ్లు తగలబడ్డాయి. ఫర్నీచర్ అంతా బూడిదైంది. ఈ భవనం ఇక పనికిరాదని నిపుణులు తేల్చారు. దీంతో కూల్చేసి కొత్త భవనం కట్టాలని నిర్ణయించారు. కూల్చివేతకు ఖర్చయ్యే 4లక్షల రూపాయలను కలెక్టర్ మంజూరు చేశారు.

## పాఠశాలల్లో మంచినీళ్ళ గంట మోగింది

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 2వ తేదీ నుండి వాటర్ బెల్ అమలులోకి వచ్చింది. పిల్లల్లో ఎక్కువ శాతం మంది సరైన మోతాదులో నీళ్ళు తాగక అనారోగ్యాల పాలవుతుండడంతో, వైద్య నిపుణుల సూచనల మేరకు ప్రభుత్వం వాటర్ బెల్‌ను ప్రవేశపెట్టింది. దీనిద్వారా పిల్లలు క్లాసుల్లోనే పలు సమయాలలో నీళ్ళు తాగొచ్చు. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నారు.

## ఆర్టీసీలో మూతపడ్డ హోటల్

- ప్రయాణీకులకు కష్టాలు

నెల్లూరులో ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో వున్న భోజన హోటల్‌ను నిర్వాహకులు మూసివేశారు. ఆర్టీసీకి చెల్లించాల్సిన నెల అద్దెతో పాటు జిఎస్టీ తడిసి మోపెడవుతుండడంతో నష్టాలు వస్తున్నాయని చెప్పి నిర్వాహకులు మూసివేశారు. భోజనం, టిఫిన్ సమయంలో ఇక్కడ దిగుతున్న బస్సుల్లోని ప్రయాణీకులు ఇక్కడ హోటల్ లేకపోవడంతో రోడ్డు మీద హోటల్స్‌కెళ్లి తింటున్నారు.

## పగిలిన పైప్‌లైన్

నెల్లూరు, హరనాథపురం జంక్షన్‌లో ఇటీవలే వేసిన భూగర్భ మంచినీటి పైప్‌లైన్ లీకై, కొద్ది సేపటికి పగిలిపోయింది. దీంతో నీళ్ళు అక్కడ రోడ్డును ముంచెత్తాయి. పైప్ పగిలిన చోట పెద్ద గుంత పడింది. వందమీటర్ల మేర రోడ్డు కుంగిపోయింది. మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి పగిలిన పైప్‌లైన్‌ను సరిచేశారు.

## ఆ వీధుల్లో... నడకే నరకం

నెల్లూరు నగరం నడిబొడ్డులో దందువారివీధి, తిప్పరాజువారి వీధి, మధ్యపతివారి వీధి వంటి చిన్న చిన్న వీధులున్నాయి. ఈ వీధుల్లో మనుషులు నడవడమే కష్టంగా వుంటోంది. ఈ వీధుల్లో కూడా భూగర్భ డ్రైనేజీ పేరుతో రోడ్లను తవ్వేశారు. తవ్విన రోడ్లను ఇంకా సరిచేయకపోవడంతో స్థానికులకు నరకయాతనగా వుంది. ముఖ్యంగా వర్షాల సీజన్ కావడంతో ఈ వీధుల్లో నడవడం కష్టంగా వుంటోంది.

## బాధ్యతలు తీసుకున్న ధనలక్ష్మి

జిల్లా పంచాయితీ అధికారిగా ధనలక్ష్మి గత నెల 29వ తేదీన నెల్లూరులోని డిపిఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జ్ డిపిఓగా వున్న సెట్నెల్ సిఇఓ సుస్మితారెడ్డి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. చిత్తూరుజిల్లాలో ఎంపిడిఓగా పనిచేస్తూ బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. జిల్లా పంచాయితీ కార్యాలయ సిబ్బంది కొత్త డిపిఓను కలిసి తమ అభినందనలు తెలిపారు.



## విద్యార్థులకు జిల్లాస్థాయిలో.. 'కౌశల్' క్విజ్ పోటీలు

నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న ఆదిత్య కళాశాలలో గతనెల 30న విద్యార్థులకు 'కౌశల్ క్విజ్-2019 పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 120 ప్రభుత్వ పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున సుమారు 5 వందల మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. 60 పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు.

జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాసులు, జయభరత్ హాస్పిటల్ ట్రస్టీ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకుడు లక్ష్మణసూరి పరిశీలకులుగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆర్.మురళీధర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, 'కౌశల్' జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్ఆర్ఎస్ ప్రసాద్, రాష్ట్ర సమన్వయకర్త పూడి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విజేతలను అందరూ అభినందించారు. విజేతలైనవారికి వరుసగా 5వేలు, 3 వేలు, 2 వేల వంతున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో కూడా విద్యార్థులకు బహుమతులిచ్చారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందినవారిని ఈనెల 14న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

## రాజావారు.. రాణీగారు హీరో హీరోయిన్ల సందడి

నెల్లూరు ఎస్-2 మల్టీ ప్లెక్స్ థియేటర్లో ఈనెల 1న రాజావారు..రాణీగారు హీరో హీరోయిన్లు కిరణ్, రహస్య సందడి చేశారు. చిత్రం ప్రదర్శితమవుతున్న ఎస్-2 థియేటర్లో హీరో కిరణ్ మాట్లాడుతూ తాను కడప నుంచి నెల్లూరులోని ఇదే థియేటర్‌కు గబ్బర్ సింగ్ చిత్రం చూసేందుకు వచ్చానని, ప్రస్తుతం అదే థియేటర్లో తాను నటించిన చిత్రం ప్రదర్శితం కావడం చాలా ఆనందంగా వుందన్నారు. తమతో పాటు దర్శకుడు రవికిరణ్ కోల, సంగీత దర్శకుడు, నెల్లూరీయుడు జైక్రిష్‌తో పాటు 80శాతం మంది కొత్తవారితో నిర్మించిన చిత్రానికి విడుదలైన అన్నిచోట్ల మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తొలుత సురేష్ ఫిలింస్ ఆర్.నాగేంద్ర వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో హీరోయిన్లు ప్రేక్షకులతో కలిసి కొద్దిసేపు సినిమాను చూశారు.

## నెల్లూరు జిల్లా వాకర్స్‌కు అవార్డుల పంట

నెల్లూరు జిల్లా వాకర్స్ అసోసియేషన్ సేవలకు ఇంటర్నేషనల్ అవార్డులు లభించాయి. ఈనెల 1వ తేదీన గుంటూరు జిల్లా కోటప్పకొండ వద్ద జరిగిన ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ లో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు మూడు, చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్‌కు రెండు అవార్డులు లభించాయి. ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి శింగంశెట్టి మురళీమోహన్‌రావుకు వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ సీతారామయ్య, మాజీ గవర్నర్ యంవి సుబ్బారెడ్డి, డిస్ట్రిక్ట్-203 గవర్నర్ లాల్‌బజీర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# మనసున్న మారాజు.. సుబ్బరామన్న

• ప్రముఖులు, అభిమానుల నివాళి



మనసున్న మారాజు, మానవత్వానికి ప్రతిరూపం, మాజీపార్లమెంటు సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 24వ వర్ధంతి కార్యక్రమం ఈ నెల 1వ తేదీ నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు జరిగింది.

పలువురు రాజకీయ నాయకులు వివిధ రంగాల ప్రముఖులు, మాగుంట అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలలోకొచ్చి సొంత నిధులతో అభివృద్ధి పనులను చేపట్టిన గొప్ప నాయకుడిగా మాగుంట సుబ్బరామరెడ్డిని అభివర్ణించాడు. ఏ తరంవారికైనా ఆయన జీవితం, ఆయన అనుసరించిన మార్గం ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు ఆయన చేసిన సేవలను మరచిపోరన్నాడు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రఘురామ్ ముదిరాజ్, ఏసునాయుడు, పత్తి రవీంద్రబాబు, నరసింహులుగౌడ్, టి.బాలసుధాకర్, పి.కోటేశ్వరరెడ్డి, టి.మల్లిఖార్జున, ప్రమిద శ్రీనివాసులు, కొండా బలరామిరెడ్డి, వి.సూర్యనారాయణరెడ్డి, వి.రవీంద్రరెడ్డి, వి.చంద్రమౌళి, ముంగమూరు గోపి, నూనె మల్లిఖార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సంజీవయ్యకు కీలక బాధ్యత

## ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యునిగా నియామకం



సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఎంతో కీలకప్రాధాన్యం ఉన్న ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలిలో సభ్యత్వం లభించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యేల కోటాలో కిలివేటికి ఈ స్థానం లభించడం పట్ల ఆయన సహచరులు, జిల్లా పార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని అంటూ ఈ యూనివర్శిటీ ద్వారా రైతులకు మేలు జరిగే ప్రయోగాలకు శ్రీకారం చుడతామని, యూనివర్శిటీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో తనవంతు కృషి ఉంటుందని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి తన కృతజ్ఞతలు తెలిపారు.

# ఆ రాక్షసులను కాల్చేసినా పాపం లేదు

## - ఎమ్మెల్యే ప్రసన్న ఆగ్రహం



మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే మానవ మృగాళ్ళను బహిరంగంగా కాల్చి చంపేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. ఈనెల 1 న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం ఇరిగేషన్ బంగ్లాలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఘటనపై తెలంగాణా హోంమంత్రి 100కు డయల్ చేయమని చెప్పడం శోచనీయమన్నారు. ఈ ఘటనలో కేవలం ఇద్దరు, ముగ్గురు చిన్నస్థాయి అధికారులను మాత్రమే ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే నేరస్తులను చైనాలో వెనుక నుంచి కాల్చడం లేదా మర్మాంగాన్ని తొలగిస్తారన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో వారంలో శిక్ష విధించి తలపై కాల్చివేస్తారని, ఉత్తర కొరియాలో మరణశిక్ష లేదా సున్నితమైన అవయవంపై తుపాకితో కాల్చివేస్తారన్నారు. సౌదీ అరేబియాలో మరణశిక్ష లేదా రాళ్ళతో కొట్టి చంపుతారన్నారు. కానీ మనదేశంలో మాత్రం ఏళ్ల తరబడి జైలులో పెట్టి మేపుతారన్నారు. లైంగిక దాడి ఘటనలపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే చట్టాల్లో మార్పులు తేవాలన్నారు. 'దిశ' ఘటనకు సంబంధించిన మానవ మృగాల మర్మాంగాలను తొలగించాలన్నారు. చేతులను నరికి కాల్చి చంపేయా లన్నారు. అప్పుడే మహిళలపై దాడులు ఆగుతాయన్నారు. సీఐ బీ.సురేష్‌బాబు, ఎస్సై షేక్ జిలానీ బాషా, వైయస్సార్ సీపీ నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, చీమల రమేష్ బాబు, ఇప్పగుంట విజయ్ భాస్కర్ రెడ్డి, షేక్ అల్లాబక్షు, కోడూరు మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ... ఉపాధి అవకాశాల నిధి

• రాష్ట్ర కార్మిక మంత్రి జయరాం

• శ్రీసిటీకి వరుసపెడుతున్న ప్రముఖులు



రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణశాఖ మంత్రి జి.జయరాం గతనెల 30న శ్రీసిటీని సందర్శించారు. తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి కార్మికమంత్రి శ్రీసిటీ ట్రేడ్ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ (పిఎం ఎస్‌వైఎం) పథకం వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించి పలువురు అసంఘటిత కార్మికులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మంత్రి మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల్లో ఇదొకటని, ఈ పథకం కార్మికులకు వృద్ధాప్యంలో రక్షణగా ఉంటుందని అన్నారు. నెలవారీ ఆదాయం 15వేలు, అంతకు తక్కువగా ఉండి 18-40 సంవత్సరాల మధ్య వయసున్న కార్మికులు ఈ పథకానికి అర్హులన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంఎస్‌వైఎం పథకం ఎంతో మంచి కార్యక్రమమని అంటూ ఈ పథకం వారోత్సవాలకు వేదికగా శ్రీసిటీని ఎంపిక చేసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి జయరాం శ్రీసిటీకి రావడం ఇదే తొలిసారి అని, అంతేకాక ప్రస్తుత ప్రభుత్వంలో శ్రీసిటీని సందర్శించిన మొదటి మంత్రి కూడా ఆయనేనని అన్నారు. ఈ పర్యటనను తామెంతో గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. మంత్రి సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ప్రాంతంలో మరికొన్ని పాలిటెక్నిక్‌లు, ఐటిఐలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించాల్సివుందన్నారు. తద్వారా ఎక్కువ మంది స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అనేక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ బ్రాండ్ పరిశ్రమలకు నిలయంగా ఉన్న వ్యాపార నగరం శ్రీసిటీ అని, ఇది తమ నియోజకవర్గంలో ఉన్నందుకు, వేలాదిమందికి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ కారణంగానే సత్యవేడు మంచి అభివృద్ధిలోకి వచ్చిందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం డిఐజి సందర్శన



అనంతపురం రేంజ్ డిఐజి కాంతిరాణా టాటా గతనెల 29న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఈ సెజ్ భద్రత పట్ల డిఐజి సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ శాంతి భద్రతలకు సంబంధించి పలు సమస్యలను శ్రీసిటీ ఎం.డి డిఐజి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డిఐజి శ్రీసిటీ పరిసరాలను పరిశీలించారు. ట్రిపుల్ ఐటి కళాశాల డైరెక్టర్ కన్నాభిరాన్ ఇక్కడి విద్యాప్రమాణాలు, భద్రత గురించి డిఐజికి తెలియజేశారు. అ తర్వాత శ్రీసిటీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి శ్రీసిటీ శాంతిభద్రతలపై అక్కడి అధికారులతో డిఐజి చర్చించారు. సత్యవేడు సిఐ శ్రీనివాసులు, శ్రీసిటీ సిఐ జగదీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జర్మనీ వాణిజ్య రాయబారి పర్యటన



చెన్నైలోని జర్మనీ వాణిజ్య రాయబారి కరీన్‌స్టోల్ ఈనెల 2న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీలో వ్యాపారానుకూలమైన వాతావరణం ఉందని అభినందించారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ జపాన్ వాణిజ్య రాయబారి పర్యటన ఫలితంగా జర్మనీ నుంచి శ్రీసిటీకి మరిన్ని పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుందని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## రాష్ట్రస్థాయి నవశకం సర్వేలో

# జిల్లాకు ద్వితీయస్థానం

## - జిల్లా కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు



రాష్ట్ర స్థాయి నవశకం సర్వేలో నెల్లూరు జిల్లా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు తెలిపారు. పెన్షన్ల నమోదులో ప్రథమ స్థానం, బియ్యం కార్డుల నమోదులో 4వ స్థానం, లా నేస్తంలో 2వ స్థానంలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 1న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సర్వే అమల్లో జిల్లా అధికారులు, గ్రామ, వార్డు వాలంటీర్లు, ఉద్యోగులు కృషి చేశారన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు పలు అర్బన్ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య ఉందని, దాన్ని అధిగమించేందుకు బీఎస్ఎన్ఎల్ జీఎంతో సంప్రదించి ఇంటర్నెట్ వేగాన్ని పెంచాలని కోరానన్నారు. జిల్లాలో ఎక్కడా ఎరువులు కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. గ్రామాలు, మండలాల్లోని ఎరువుల కేంద్రాల నుంచి ఇంటికే డోర్ డెలివరి చేసే ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈనెల 21న చేనేత నేస్తం పథకాన్ని ప్రారంభించామని, జిల్లా వ్యాప్తంగా 7 వేల కుటుంబాల్లోని 35వేల మందికి ఈ పథకం వర్తించనున్నదన్నారు. ఈనెల 15 వ తేదీ కల్లా జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని, జనవరి 1వ తేదీ నుంచే నేరుగా ఆయా ఉద్యోగుల ఖాతాల్లో జీతం జమ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# రూపాయితో పని పూర్తి

## అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల రిజిస్ట్రేషన్

అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాలు రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు గత నెల 29న కలెక్టరేట్‌కు మార్గదర్శకాలు వచ్చాయి. ఎటువంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాలకు సంబంధించి తహశీల్దార్, కమిటీ సభ్యులు పరిశీలించి అభ్యంతరం లేదని ధ్రువపత్రం ఇస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిపై రుణాలు పొందవచ్చు, ఇతరులకు అమ్ముకోవచ్చు. ఆ స్థలంలో గృహం నిర్మిస్తే రుణం కూడా పొందే వీలుంది. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేటల్లో సుమారు ఐదు వేల కుటుంబాలు రెవిన్యూ, మునిసిపాలిటి. నీటి పారుదల. రహదారులు భవనాల శాఖలకు చెందిన ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకుని ఏళ్ళ తరబడి జీవిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని కుటుంబాలకు పక్కా ఇళ్ళను నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో మిగిలిన వారికి మేలు చేకూర్చినట్లయింది.

### రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే..

రూపాయికే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. 2015 అక్టోబర్10 నుండి ఆ స్థలంలో నివాసం ఉండాలి. అందుకు గాను రుజువుగా పన్ను, కరెంట్ బిల్లు తదితర ఆధారాలు ఉండాలి. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారు మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. 100గజాల లోపు స్థలాన్ని కేవలం రూపాయి చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు, 100 నుంచి 300 చదరపు గజాలున్న వారికి కలెక్టర్ నిర్దేశించిన మార్కెట్ విలువను బట్టి క్రమబద్ధీకరిస్తారు.

# అరచేతిలో పథకాలు చూపి.. నిధులు మింగేశారు

## - టిడిపి నాయకుల తీరుపై ముక్కాల ధ్వజం



గత టిడిపి ప్రభుత్వంలో పాలకులు ప్రజలకు అరచేతిలో పథకాలు చూపి నిధులు మింగేశారని, నెల్లూరులో హౌస్ ఫర్ ఆల్ పథకంలో కోట్లాది రూపాయలు దోపిడీ జరిగింది వాస్తవం కాదా అని మాజీ డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్ ప్రశ్నించారు. నెల్లూరులోని నవాబుపేటలో ఉన్న వైకాపా కార్యాలయంలో ఈనెల 2న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి తీరును దుయ్యబట్టారు. అర్హులైన వారికి ఇళ్ళు ఇవ్వకుండా టిడిపి ఇంకా ఆ సమస్యపై డ్రామాలాడుతోందన్నారు. ఈ పథకంపై మాజీ మేయర్ అజీజ్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గడిచిన అయిదేళ్లలో గుర్తుకురాని సమస్యలు ఇప్పుడు ఆయనకు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. షీర్‌వాల్ టెక్నాలజీ అంతా షేరింగ్ టెక్నాలజీగా మారిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందని, గత ప్రభుత్వం సృష్టించిన సమస్యలను కూడా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారని ఆయనన్నారు. మంత్రి అనిల్ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పటినుంచి అర్హులైన పేదలకు ఇళ్ళు కేటాయిస్తామని చెప్పిన విషయం గుర్తు చేస్తూ, లబ్దిదారులు ఇక అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఒక్క పైసా కూడా పేదలకు ఖర్చు కాకుండా అర్హులకు ఇళ్ళను అందజేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు దామవరపు రాజశేఖర్, కర్తం ప్రతాప్‌రెడ్డి, పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఓబిలి రవిచంద్ర, దొంతాలి రఘు, శివారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగార్జున, నాగరాజు, సత్యకృష్ణ పాల్గొన్నారు.

# మంచినీళ్ళతో కిడ్నీ వ్యాధులు దూరం

తగినంతగా మంచినీళ్ళు తాగుతుంటే కిడ్నీ వ్యాధుల బారి నుంచి మనం బయటపడ్డట్టేనని నెల్లూరులోని నారాయణ స్పెషాలిటీ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. నారాయణ హాస్పిటల్‌లో గతనెల 30న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి నెలరోజుల పాటు కిడ్నీవ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బిజు రవీంద్రన్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ రాఘవేంద్ర,ఏజిఎం సిహెచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఈవ్‌టీజింగ్‌పై ఉక్కుపాదం

### - జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



ఈవ్‌టీజింగ్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని విద్యాలయాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. గూడూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను చర్చించారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్ళతో పాటు విద్యాసంస్థలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటుచేసి గట్టి నిఘా ఏర్పాటుచేస్తున్నామన్నారు. విద్యార్థినులు, యువతులకు తద్వారా రక్షణ కల్పించడం సులభతరమవుతుందన్నారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపరచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. యువతులు, విద్యార్థినులు, మహిళలకు సమస్యలు ఎదురైతే తక్షణం 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. డిఎస్పీ శ్రీభవాని హర్ష, సిఐలు రామకృష్ణారెడ్డి, దశరథరామారావు, ఎస్ఐలు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగివుండాలి




రోగులకు దుప్పట్లు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ రోహిణి

ప్రజలందరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఈ నెల 2న గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని హెచ్‌ఐవి రోగులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధికి అందరూ దూరంగా ఉండాలని, తగు ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆ వ్యాధిని నియంత్రించవచ్చని అన్నారు. అనంతరం ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరికీ అవగాహన కలిగించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు జీవనిరెడ్డి, జమునమ్మ, విష్ణువందన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందిన కమిషనర్



ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటున్న కమిషనర్

పేదవారం సైతం మెరుగైన వైద్యం కోసమని ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న నేటి రోజుల్లో గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. నవశకం సర్వేలో తలమునకలై ఉన్న ఆయన ఈనెల 2న అస్వస్తతకు గురయ్యారు.

అయితే ప్రైవేటు వైద్యం కోసం వెళ్ళకుండా గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు వెళ్ళి రక్తపరీక్షలు చేయించుకుని తగు చికిత్స పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణ మార్పుల వల్ల ప్రజలు వైరస్ వ్యాధులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మహిళలపై హత్యాచారాలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలి



'సేవ్ గర్ల్స్' ఆకారంలో కూర్చుని నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

మహిళలపై నానాటికీ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, సమాజంలో రానురాను మానవత్వం అన్నదే మాయమవుతోందని గూడూరులోని ఆదిశంకర స్కూల్ ప్రిన్సిపాల్ రూపవతి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల 'దిశ'పై పాశవికంగా జరిగిన హత్యాచారం దారుణమని, ఈ ఘటనకు కారణమైన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని అన్నారు. అనంతరం స్థానిక గడియారపు స్తంభం కూడలి వద్ద 'సేవ్ గర్ల్స్' అంటూ పాఠశాల విద్యార్థినులు నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు రఫీ, సుప్రజ, శ్రీహరి, సునీల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో.. దివ్యాంగులకు సన్మానం



దివ్యాంగులను సత్కరిస్తున్న గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యుడు మయూరి శ్యాంయాదవ్, వెంకటేశ్వరరావు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు దివ్యాంగులను గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యుడు, శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బి.మయూరి శ్యాంయాదవ్, రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరరావుతో కలసి సత్కరించారు. శ్రీకృష్ణ సేవాసమితి 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులను సత్కరించుకోవడం తమకెంతో సంతోషంగా ఉందని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక పథకాలను సద్వినియోగం చేసుకోండి



పింఛన్ నమోదుపత్రాలను డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డికి అందజేస్తున్న సహాయ కమిషనర్ ఓంకారరావు

పింఛన్ వారోత్సవాల్లో భాగంగా కార్మికశాఖ ఆధ్వర్యంలో ఈనెల 3న గూడూరులోని డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకారరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు, సిబ్బంది, ల్యాబ్‌టెక్నీషియన్‌లు ఈ పథకంలో నమోదయ్యేలా చూడాలని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి కోరారు. సహాయ కార్మిక అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

# మృగాళ్లను ఉరితీయాలి



## • 'దిశ' హత్యోదంతంపై నగరంలో నిరసనల వెల్లువ

ఇటీవల హైదరాబాద్ శివారుల్లోని శంషాబాద్ వద్ద దిశపై జరిగిన హత్యాచారం పట్ల నెల్లూరు జిల్లాలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల ప్రజలు, పెద్దఎత్తున మహిళలు, పలు పార్టీలవారు ప్రదర్శనలు చేసి 'దిశ' హత్యోదంతం దారుణమని ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 2న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో బిజెపి నాయకురాళ్ళు మాట్లాడుతూ దిశను అత్యంత అమానుషంగా హత్య చేసిన మానవ మృగాలను ఉరితీయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధవి, నాయకురాళ్ళు సుభాషిణి, పద్మావతి, వసుంధరా చౌదరి, విజయలక్ష్మి, కమల, రాజేశ్వరి, అనురాధారెడ్డి, లక్ష్మి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

### కేంద్రం కఠినచట్టాలు తేవాలి - ఐద్వా

దేశంలో మహిళలపై హత్యాచారాలు దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ఈ దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినచట్టాలు తీసుకురావాలని ఐద్వా నగర కార్యదర్శి ఎస్కె మస్తాన్‌బీ అన్నారు. దిశను హత్యచేసిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని, కేంద్రం అందుకు కఠినచట్టాలను తీసుకురావాలని అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 2న నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో మహిళలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. ఐద్వా నేతలు ఎస్కె మహ్మద్, షకీల, నాగేశ్వరమ్మ, ధనమ్మ, మంజుల, భార్గవి, షాహిదా, ప్రమీల, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ఈనెల 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దిశపై అమానుషానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కొండమ్మ డిమాండ్ చేశారు.

### న్యాయవాదుల నిరసన

దిశపై లైంగికదాడి, హత్యను పెద్దఎత్తున నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈనెల 2న కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఏపి బార్ కౌన్సిల్ సభ్యుడు, బార్ ప్రధాన కార్యదర్శి వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, రోజారెడ్డి మాట్లాడుతూ దిశ కేసులోని నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు రమణారెడ్డి, రంగారావు, రంగరాజన్, శ్రీనివాసన్, బాలసుబ్రహ్మణ్యం, రాజేష్‌తో పాటు బార్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అత్యంత అమానుషం - నెరసం

దిశపై జరిగిన దాడి– హత్య అత్యంత అమానుషమని, ఈ కిరాత కానికి పాల్పడిన దోషులను ఉరితీయాలని నెల్లూరు జిల్లా రచయితల సంఘం డిమాండ్ చేసింది. నెల్లూరులోని టివిఎస్ కల్యాణ సదన్‌లో ఈనెల 2న ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ నిర్భయ చట్టాన్ని నీరుగార్చడం వల్లనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దిశపై అమానుషానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

### కెవిన్నార్ విద్యార్థినుల ఆందోళన

దిశపై జరిగిన దాడి పట్ల నెల్లూరులోని కెవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు తీవ్రంగా స్పందించారు. ఈ దాడి ఎంతో కిరాతకమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లల రక్షణకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 2న కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి దిశ హత్యోదంతం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పులి చెంచయ్య, అధ్యాపకులు గౌస్‌బాషా, మోహన్, మురళి, రాజ్యలక్ష్మి, చంద్రకళ, సాజిదా బేగం, శ్రీనివాసులు పాల్గొన్నారు.




47వ వర్ధంతి

మా తండ్రిగారైన
శ్రీకంటి వెంకటరత్నం గారు
దైవసన్నిధి చేరి 47 సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచేవుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ..

స్వర్గీయ శ్రీకంటి వెంకటరత్నం గారు
ఆడిటర్ & కవి
మరణం : 2-12-1972

| కుమారులు | - | కోడళ్లు |
|---|---|---|
| - | - | మాలతి |
| శ్రీకంటి రామమోహన్‌రావు | - | రాజ్యలక్ష్మి |
| శ్రీకంటి రమణమూర్తి | - | సీతమ్మ |

| కుమార్తెలు | - | అల్లుళ్లు |
|---|---|---|
| కారుమంచి ఇందిర | - | - |
| యరగుడిపాటి వసంత | - | ప్రభాకరరావు |
| మద్దాలి వసుప్రద | - | వెంకటకృష్ణారావు |

మనుమరాలు
వెంకటమంజుప్రీతి - కామేశ్వర్
మునిమనుమడు : ఆర్యన్
మనుమడు
S.V.మనోజ్‌కుమార్- ఉజ్వల
S.V. రత్నం & కో. స్టాఫ్, గూడూరు


శ్రీను గల్పిక

# వివేకా కలను చెడగొట్టిన ఇంద్రుడు

అదొక ఎడారి ప్రాంతం... పూర్తిగా నిర్మానుష్యంగా వుంది. అంతలో వున్నట్లుండి ఒక అమ్మాయి హెల్ప్... హెల్ప్... అంటూ పరుగులు తీస్తోంది. ఆమె వెనుకే నాలుగు సుమోలు రయ్ రయ్‌న దూసుకు వస్తున్నాయి. అందులో వున్న రౌడీలు కత్తులు తిప్పుతున్నారు. ఆ అమ్మాయి పరుగెత్తి పరుగెత్తి ఒకచోట పడిపోయింది. నాలుగు సుమోలు అక్కడకు వచ్చి ఆగాయి. అందులో నుండి 40మంది దాకా గూండాలు దిగారు. అందరి చేతుల్లో కత్తులు, తుపాకులు వున్నాయి. అప్పుడే అక్కడ ఒక బెంజ్‌కారు ఆగింది. అందులో నుండి విలన్ సోనూసూద్ దిగాడు. అతను భయంకరంగా నవ్వుతూ.... ఏమే బొమ్మాళి నన్ను తప్పించుకుని పోదామనుకున్నావా... ఈ ప్రపంచంలో నిన్ను ఎక్కడున్నా పట్టుకుంటాను... నా బానిసను చేసుకుంటాను, నాతోనే నీకు జీవితం... నిన్ను కాపాడే మొనగాడు ఈ భూమ్మీద వుండడు... అంటూ ఆమెపై చేయి వేయబోయాడు. అంతే... ఎక్కడనుండి వచ్చాడో ఒక మెరుపువీరుడు టక్కున వచ్చి విలన్ సోనూసూద్ చేయిని ఆ అమ్మాయి ఒంటిపై పడకుండా తన ఎడమ చేతిని అడ్డంపెట్టి కుడిచేతి పిడికిలి బిగించి అతని ముఖం మీద గుద్దాడు. ఆ దెబ్బకు అతను అరకిలోమీటరు దూరంలో ఎగిరిపడ్డాడు. వెంటనే రౌడీలంతా అలర్ట్ అయ్యి అతన్ని చుట్టుముట్టారు. ఆ వ్యక్తి తాపీగా.. రేయ్ రౌండప్ చేసి నన్ను కన్ఫ్యూజ్ చేయొద్దు... ఈ కన్‌ఫ్యూజన్‌లో మిమ్మల్ని కొడతానో, నన్ను నేను కొట్టుకుంటానో అర్థం కాదు, మీకు ఒక ప్రామిస్ చేస్తున్నా, నా నల్ల కళ్లద్దాలను ఆకాశంలోకి విసిరేస్తా... అవి తిరిగి నా కళ్లకు వచ్చి చేరేలోపు మిమ్మల్ని చితక్కొట్టేస్తా అని డైలాగ్ వదిలాడు. అప్పుడు రౌడీలలో ఒకడైన ఫిష్ వెంకట్... అంత మగాడివా, అయితే వీళ్లందర్నీ తన్ను, నేను అలా టాయిలెట్‌కు వెళ్లొస్తా అంటూ పక్కకు పోయాడు. అతను కళ్లజోడు ఆకాశంలోకి విసిరేశాడు... అది షార్ సెంటర్ నుండి వదిలిన రాకెట్‌లా పైకి దూసుకుపోసాగింది.... ఈలోపు అతను తనను చుట్టుముట్టిన రౌడీలను గాల్లోకి లేపి తంతున్నాడు. ఇలా రెండు నిముషాలలో మొత్తాన్ని పడుకోబెట్టాడు. అసలు విలన్ సోనూసూద్ ఓపిక తెచ్చుకుని లేచి వచ్చి మళ్లీ ఫైటింగ్‌కు దిగాడు. ఈసారి ఆ వ్యక్తి సోనూసూద్‌ను వీరబాదుడు బాదాడు. ఆ దెబ్బలకు అతను పూర్తిగా పడిపోయాడు. అప్పుడే ఆకాశంలో నుండి కళ్లజోడు వచ్చి కరెక్ట్‌గా ఆయన నుదుటిమీద పడింది. అప్పుడే అతని చేతిలో రక్షించబడిన ఆ అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి అతనిని కౌగిలించుకుంది. అప్పుడు అతను... రేయ్... సోనూసూద్... గుర్తుపెట్టుకో, అనుష్క నా ప్రాణం.. ఆమెను నా నుండి వేరు చేయాలంటే నీ గుండెల్లో దిగుతుంది బాణం... నా అనుష్కను నా నుండి ఎవరూ వేరు చేయలేరు... ఎవరూ వేరు చేయలేరు... అని అరుస్తుండగా, ముఖం మీద నీళ్లు పడినట్లనిపించడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి. తీరా చూస్తే అనుష్క లేదు గాని ఎదురుగా స్వర్గలోకాధిపతి ఇంద్రుడు, ఆయన పక్కన ఎన్టీఆర్, వైయస్ రాజశేఖరరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, మర్రి చెన్నారెడ్డి వంటి మహానాయకులున్నారు. వైయస్ వుండి... ఏంటి వివేకా, 'అనుష్క' అని కలవరిస్తున్నావు అని అడిగాడు. దానికి వివేకా, నేను అనుష్కకు పెద్ద ఫ్యాన్‌నన్నా... ప్రతిరోజూ పడుకునే ముందు ఆమెనే తల్చుకుంటా... అని అంటుండగా, నేదురుమల్లి వుండి... ముఖానికి ఆ రంగులేంటి, నిద్రలో కూడా కళ్లకు ఆ కళ్లద్దాలేంటి అని అడిగాడు. దానికి వివేకా... చెప్పాను కదన్నా నేను పడుకునే ముందు అనుష్కను తలచుకుంటానని, ఆమె కలలోకి వస్తే నేను గ్లామర్‌గా కనిపించొద్దా... అందుకే పడుకునే ముందు మేకప్ వేసుకుంటాను, రాత్రి ఆమె గురించి ఆలోచిస్తూ పడుకోబట్టే ఆమెతో కలిసి నేను హీరోగా సినిమా చేస్తున్నట్లు, ఆమెను రౌడీలు పట్టుకోబోతే నేను కాపాడినట్లు కలొచ్చింది. అనుష్కను నేను కౌగిలించుకున్న సమయంలో మీరొచ్చి ముఖం మీద నీళ్లు చల్లి డిస్ట్రబ్ చేశారు అని, ఇంతకూ ఇంత పొద్దున్నే మీరంతా కట్టకట్టుకుని వచ్చి నా బంగారం లాంటి కలను పాడుచేయడానికి కారణమేంటి అని అడిగాడు. అందుకు వైయస్ వుండి... మొన్న భూలోకం నుండి కాలం చేసిన ఓ పాత పేపర్లు కొనుక్కునే వ్యక్తిని ఇంద్రలోక భటులు తీసుకొచ్చారు... అతను వస్తూ వస్తూ తన వెంట పాత పేపర్ల మూటలు కూడా తెచ్చాడు. అందులో కొన్ని పేపర్లు ఇంద్రుడి కంట పడ్డాయి. ఆ పేపర్లలో వున్న వార్తలను చూసినప్పటి నుండి మన ఇంద్రుడు అన్యమనస్కంగా వున్నాడు. ఆందోళన చెందుతున్నాడు అని చెప్పాడు. ఏం వార్తలు అవి అని వివేకా అడిగాడు. వైయస్ కొన్ని పాతపత్రికలు అతని ముందుంచాడు. అన్నీ 'తెలుగుజ్యోతి' పత్రికలే.... వాటిలో హెడ్డింగ్‌లు... **"స్వర్గలోకపు రాజధాని అమరావతిని మించిన రాజధాని నిర్మిస్తాం... మనం నిర్మించిన రాజధాని చూసి ఇంద్రుడే సిగ్గుపడాలి, ఇలాంటి రాజధానిని మనమెందుకు కట్టుకోలేకపోయామా అని ఆయనే బాధపడాలి - సీఎం చంద్రబాబు..."** అని వుంది. అది చూసి వివేకా దీనివల్ల ఏమైందని అడిగాడు. తమ అమరావతికన్నా మన ఆంధ్ర అమరావతి బాగుంటుందని, తన పరపతి తగ్గుతుందని ఇంద్రుడు భయపడుతున్నాడు అని నేదురుమల్లి చెప్పాడు. అది విని వివేకా పగలబడి నవ్వుతూ... చంద్రబాబు స్టేట్‌మెంట్లను కూడా మీరు నమ్ముతారా... మా రాష్ట్రంలో అయితే ఆయన మాటను ఆయన ఇంట్లో గుమస్తా కూడా నమ్మడు అని చెప్పాడు. దానికి ఇంద్రుడు.. లేదు, నాకెందుకో అనుమానంగానే వుంది. ఆయన మా అమరావతిని తలదన్నేలా ఏపి అమరావతిని నిర్మించి వుంటాడు అని అన్నాడు. అందుకు వివేకా... అక్కడంత సీన్ లేదు... మీ డౌట్ అదే అయితే నేరుగా చూడండి... అంటూ 'ఓం అనుష్క అరుంధతి యామి' అనే మంత్రం చదివాడు. అందర్నీ కిందకు చూడమన్నాడు.

అమరావతి ప్రాంతంలోకి అప్పుడే కొన్ని బస్సులొచ్చి ఆగాయి. అందులో నుండి హైటెక్ రత్న చంద్రబాబు నాయుడుతో పాటు మరికొందరు టిడిపి నాయకులు దిగారు. చంద్రబాబు దిగడంతోనే నడుం వంచి మట్టిని ముద్దాడాడు. అక్కడేవున్న యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్... పరుగెత్తుకుంటూ వచ్చి... సార్, ఎంత అడ్డమైన గడ్డి తింటామనే పేరున్నప్పటికీ ఇలా బహిరంగంగా గడ్డి తినడం ఏం బాగాలేదన్నాడు. నోర్ముయ్, నేను గడ్డిని తినడం లేదు, మట్టిని ముద్దాడాను అని చంద్రబాబు కోపంగా చెప్పాడు. అంతలో అక్కడకు పెద్దఎత్తున రైతులొచ్చారు. వారంతా చెప్పులను తమ చేతుల్లోకి తీసుకున్నారు. అది చూసి చంద్రబాబు... ఇది రాజుల కాలం కాదు... నా ముందు మీరు చెప్పులేసుకునే తిరగొచ్చు... చేతుల్లో పట్టుకోవాల్సిన పని లేదన్నాడు. పక్కనే వున్న దేవినేని ఉమ... సార్, వాళ్లు చెప్పులను చేతుల్లోకి తీసుకున్నది మన మీద గౌరవంతో కాదు, మనమీద పగతో లాగుంది, మనమీద విసరడానికి లాగుంది అంటుండగానే రైతుల్లో నుండి ఒకడు చెప్పులు వాళ్లపైకి విసిరేశాడు. చంద్రబాబు ఇక్కడ డేంజర్ వుంది... పరుగెత్తండ్రా అని అరిచాడు... అందరూ పరుగెత్తసాగారు.

పైనుండి ఇదంతా లైవ్‌లో చూస్తున్న వివేకా, మిగతా వారితో వేలమంది రైతుల పొట్టకొట్టి చెయ్యాలనుకునే ఏ పనీ సక్సెస్ కాదు సార్, ప్రజల ఆశీస్సులతో చేస్తే మీలాంటి అమరావతిలు వంద కట్టొచ్చు... వాళ్ల ఆశలను సమాధి చేస్తే ఒక్క అమరావతిని కూడా కట్టలేరు అని చెప్పాడు. లైవ్‌లో అమరావతి అసలు రూపం చూసిన ఇంద్రుడు అప్పుడు మనశ్శాంతిగా అక్కడనుండి కదిలాడు.

# కళ్యాణ వైభవం...!




ఆత్మకూరు ప్రాంత ప్రజల మనసుల్లో దేవుడిగా నిలిచిన వైద్యరత్నం, మాజీ శాసనసభ్యులు డా॥ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి మనుమరాలు, మాజీ జడ్పీటీసీ డా॥ బొమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి - శ్వేతల కుమార్తె **ప్రణవి - రాజేష్** (అనంతసాగరం మండలం రేవూరు వాస్తవ్యులు పాలేటి రమణారెడ్డి - లక్ష్మీప్రసన్నల కుమారుడు)ల కళ్యాణం అక్టోబర్ 22వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.




ప్రముఖ మెజీషియన్, హిప్నాటిస్ట్ గుంజి రాంజీ - శ్రీదేవిల కుమార్తె **అనుజ్ఞ - కైలాష్** (విద్యానగర్ వాస్తవ్యులు డా. మల్లి శివయ్య - భవానిల కుమారుడు)ల వివాహం ఈ నెల 1వ తేదీ బుచ్చిరెడ్డిపాళెంలోని లైలా ఫంక్షన్‌హాల్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.

# జిల్లా ఎస్పీగా భాస్కర భూషణ్

నెల్లూరుజిల్లా కొత్త ఎస్పీగా భాస్కర భూషణ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ ఎస్పీగా వున్న ఐశ్వర్య రస్తోగిని మంగళగిరిలోని ఏఐజి అడ్మిన్‌కు బదిలీ చేసింది. బీహార్‌కు చెందిన భాస్కరభూషణ్ 2009 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డ ఆయన మొదట కరీంనగర్‌లో ట్రైనీ ఐపిఎస్‌గా పనిచేశాడు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం ఓఎస్‌డిగా తొలి పోస్టింగ్, ఆ తర్వాత అదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి ఏఎస్పీగా పని చేశాడు. రాష్ట్ర విభజనతో ఆయన ఆంధ్రాకు కేటాయించబడ్డాడు. 2015 నుండి 2017 వరకు పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా పని చేశాడు. పరిపాలనలో తనదైన ముద్ర వేసుకుని మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత ఇంటలిజెన్స్ ఎస్పీగా కొంతకాలం పనిచేశాడు. గత కొంతకాలం నుండి డిజిపి కార్యాలయంలో వెయిటింగ్‌లో వున్నారు.

ఇక ఇక్కడ నుండి బదిలీ అయిన ఐశ్వర్య రస్తోగి గత ఏడాది అక్టోబర్ 31న ఎస్పీగా బాధ్యతలు చేపట్టాడు. 13నెలల పాటు ఈ జిల్లాలో ఎస్పీగా సేవలందించాడు. నూతన పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించడం, 2019 ఎన్నికలు వంటి కీలక ఘట్టాలు ఆయన కాలంలోనే జరిగాయి. నేర నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బాగా వాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ప్రవేశపెట్టాడు. జిల్లాలో అక్రమ రవాణా నివారణకు, ఈవ్‌టీజింగ్‌ను అరికట్టడానికి కృషి చేశాడు.

# ఫ్రెండ్స్ వాకర్స్‌కు 5 అవార్డులు



గుంటూరు జిల్లా కోటప్పకొండ శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపంలో ఈనెల 1న వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా 2019 జనవరి నుండి అసోసియేషన్స్ చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డులను అందజేశారు. నెల్లూరు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను బెస్ట్ ప్రెసిడెంట్‌గా నలుబోలు బలరామయ్య నాయుడు, స్పెషల్ అప్రిసియేషన్ కార్యదర్శి అవార్డు వినుకొండ వెంకటేశ్వర్లుకు, ఉత్తమ కోశాధికారిగా కొండూరు సుబ్బారావు, జాలీ వాకర్ ఐ.సోనుకు ఉత్తమ మహిళా అవార్డు, క్లబ్‌కు బెస్ట్ మార్థాన్ అవార్డుకు ఎంపిక చేసి 203 గవర్నరు షేక్ లాల్‌వజీర్, ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్-11ఎలక్ట్ శ్యామల శ్రీనివాసులురెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ యంవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. వాకర్స్ సభ్యులు బెల్లం చెంచయ్య, యం.ప్రసాద్, కె.శివయ్య, డిటి తిరుపతి నాయుడు, వీరిశెట్టి హజరత్‌బాబు, ఎన్ సాయి సుబ్బారావు పాల్గొన్నారు. లక్కీ డిప్ విన్నర్ గా మాగంటి ప్రసాద్ బహుమతి అందుకున్నారు.

# ఆనంకు అందలం

(మొదటి పేజీ తరువాయి)



బాధ్యతలు చేపడుతున్న ఆనం విజయ, వీరి చలపతి

ఎవ్వరూ ముందుకు రాని పరిస్థితుల్లో నేను చేస్తానంటూ ముందుకొచ్చి పోటీ చేసిన నాయకుడు విజయకుమార్‌రెడ్డి. పార్టీ పట్ల ఆనం విజయకుమార్‌రెడ్డి చూపిస్తున్న చిత్తశుద్ధికి, అంకిత భావానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆయనకు తగిన ప్రాధాన్యతనే ఇచ్చాడు. నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా ఆనం విజయకుమార్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆనం విజయను ఛైర్మెన్‌గా నియమించగా, చెన్ను బాలకృష్ణారెడ్డి, మద్దూరి సోమశేఖరరెడ్డి, మేరిగ మధుసూదన్, చింతాయల తిరుమలరాణి, డక్కిలి రమణయ్య, సయ్యద్ గౌస్ మొహిద్దీన్‌లను పాలకమండలి సభ్యులుగా నియమించడం జరిగింది. అలాగే జిల్లా కేంద్ర మార్కెటింగ్ సహకార సంఘం ఛైర్మెన్‌గా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు, మాజీ జడ్పీటీసీ వీరి చలపతిరావును నియమించారు. సభ్యులుగా దాసరి భాస్కర్‌గౌడ్, మన్నవరపు రవికుమార్, గునుపాటి సురేష్‌రెడ్డి, పందిళ్ళపల్లి రాజేశ్వరమ్మ, చేజర్ల చలమారెడ్డి, ఎస్.కె.ఆలీలను నియమించారు. సహకార బ్యాంకులకు, సహకార మార్కెటింగ్ శాఖలకు ఎన్నికలు నిర్వహించేంతవరకు ఈ పాలకవర్గాల పాలన వుంటుంది. ఈ నెల 5వ తేదీన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా ఆనం విజయకుమార్‌రెడ్డి చింతారెడ్డి పాళెంలోని తన స్వగృహంలో బాధ్యతలు స్వీకరించాడు. గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్, బ్యాంకు సి.ఇ.ఓ రమణారెడ్డిలు కూడా పాల్గొన్నారు. అలాగే డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా వీరి చలపతిరావు అదేరోజు బాధ్యతలు స్వీకరించాడు.

## బ్యాంకుతో ఆనం బంధం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు ఆనం కుటుంబానికి విడదీయరాని అనుబంధం వుంది. ఆనం వివేకానందరెడ్డి, ఆనం భక్తవత్సలరెడ్డిలు గతంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌లుగా పనిచేసి వుండగా, ఆనం రామనారాయణరెడ్డి మాత్రం జిల్లా సహకార మార్కెటింగ్ శాఖ సొసైటీ ఛైర్మెన్‌గా పనిచేసి వున్నాడు.

## 'విజయ'ప్రస్థానం

ఆనం సోదరులలో చివరివాడైన ఆనం విజయకు నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మంచి పట్టుంది. 2014 ఎన్నికల్లో ప్రజలు చీదరించుకున్న కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కూడా ఆయన రూరల్‌లో 13వేలకుపైగా ఓట్లు తెచ్చుకున్నాడు. కేవలం ఇవి అతనిని చూసి వేసిన ఓట్లే! స్వగ్రామం చింతారెడ్డిపాలెం నుండి ఆయన రాజకీయ పయనం మొదలైంది. ఆ గ్రామ సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించాడు. నరసింహకొండ దేవస్థానం ఛైర్మెన్‌గా పనిచేశాడు. తన సోదరులు ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు పోటీ చేసిన అన్ని ఎన్నికలలోనూ వారి పల్లకీలు మోశాడు. ఇన్నేళ్ల శ్రమకు జిల్లా స్థాయి పదవితో ఆయనకు ఒక గుర్తింపు లభించినట్లయ్యింది.

## కాలధర్మం

# ఆనం వెంకటకృష్ణారెడ్డి



నెల్లూరు నగరంలో ఎందరికో ఆత్మీయుడు, నెల్లూరు నగరాన్ని సుందరంగా చూడాలని ఆశించిన స్వాప్నికుడు, మృధుస్వభావి ఆనం వెంకటకృష్ణారెడ్డి(ఏ.వి.కృష్ణారెడ్డి) అక్టోబర్ 30వ తేదీన తన 82వ యేట గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. నెల్లూరు, ముత్తుకూరు రోడ్డులో వెళ్లేటప్పుడు 'శ్రీకృష్ణ అవెన్యూ' అనే అందమైన భవనం కనిపిస్తుంది. దానిని చూడగానే అందరికీ ఏ.వి.కృష్ణారెడ్డి గుర్తుకు వస్తారు.

నెల్లూరు నగరం అలా వుండాలి, ఇలా వుండాలి అని చెప్పి ఆయన కలలు కనడమేకాదు, ఆ కలను నిజం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను నిరంతరం కలుస్తుండేవారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్‌ను తీసుకురాకముందే, నగరాన్ని ఎలా శుభ్రంగా, సుందరంగా వుంచాలన్నదానిపై మున్సిపల్ ఉన్నతాధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా ఎస్పీగా శ్రీనివాసరెడ్డి వున్న సమయంలో ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా వున్న ఏ.వి.కృష్ణారెడ్డి నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై మ్యాప్‌ల రూపంలో పోలీసువారికి అందించి వారికి అన్ని విధాలా సహకరించారు. నగరంలో దోమల నిర్మూలనకు కూడా మున్సిపల్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన సందర్భాలున్నాయి.

ఏవికె రెడ్డి ఏ పని చేపట్టినా ఆ పనిలో నాణ్యత కోసం ఎక్కువ తపించేవాడు. తాను సభ్యుడిగా వున్న సంస్థల్లో ఎక్కడైనా చిత్తశుద్ధి, అంకితభావం లోపించిందనిపించినా, నియమనిబంధనలు పాటించడంలో సంస్థలోని ఇతర సభ్యులు సక్రమంగా వ్యవహరించకపోయినా వారితో విబేధించి తన పదవికి రాజీనామా చేసేసేవాడు. చెన్నైలోని వీరారెడ్డి సత్రం ఆస్థుల విముక్తి కోసం ఆయన అలుపెరుగని పోరాటం సాగించాడు. టౌన్‌హాల్ కమిటి సభ్యుడిగా తన సేవలందించాడు. రెడ్డిజన సేవా సంఘం సభ్యుడిగా సుదీర్ఘకాలం కొనసాగాడు. స్నేహశీలతతో ఎక్కువ స్థాయిలో మానవ సంబంధాలు కలిగి వుండడంతో పాటు తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏ విషయంలోనైనా ముక్కుసూటిగా వ్యవహరించేవాడు. తాను అనుకున్నది ఏదైనా ఎదుటివారి ముఖాన్నే చెప్పే గుణం ఏవికెరెడ్డిది. రామలింగాపురం జంక్షన్‌లో ఇప్పుడున్న ట్రాఫిక్ సమస్యను 15ఏళ్ళ క్రితమే ఆయన గుర్తించి, ఇక్కడ ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలంటూ అప్పుడే ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. అయినా ఆయన ప్రయత్నం ఈనాటికీ రూపుదాల్చకపోవడం చూస్తున్నాం.

సామాజిక కోణంలో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డ ఏ.వి.కృష్ణారెడ్డి తన అభిమాన క్రికెటర్ యువరాజ్‌సింగ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలిసినప్పుడు... ఒంటి చేత్తో టీమిండియాను గెలిపించిన మీకు ఈ క్యాన్సర్‌ను గెలవడం పెద్ద లెక్కకాదంటూ లేఖలు వ్రాసి ఆయనలో మానసిక ధైర్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.

నెల్లూరులో పేరుమోసిన నెల్లూరుక్లబ్ కేర్ టేకర్‌గాను, మెక్లిన్స్ క్లబ్ మెంబర్‌గాను ఆయన సేవలందించారు. నగరంలో అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు ఆయనకు మిత్రులు, ఆత్మీయులే! ముఖ్యంగా వారంతా కూడా ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆత్మీయ బంధాలతోనే ఆనందాన్ని వెతుకుతున్న ఆనం వెంకటకృష్ణారెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# మున్సిపల్ ఉద్యోగుల ముసుగులో.. దొంగలు

- డ్రైనేజీ బాగుచేస్తామని వచ్చి..బీరువాలో నగలు దోచేశారు
- పన్నెండున్నర సవర్ల బంగారు, 5వేల డబ్బు కాజేశారు
- మహిళలూ... తస్మాత్ జాగ్రత్త!

ఇళ్ళలో మహిళలు ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా బురిడీకొట్టించేందుకు దుండగులు తయారుగా ఉంటున్నారు. మాయమాటలు చెప్పి అందినంత డబ్బా దస్కం దోచుకుపోతున్నారు. నెల్లూరు నగరంలో జరిగిన ఓ ఘటన ఉదంతం ఇలా ఉంది. నగరంలోని పరమేశ్వరి నగర్‌లో రామసీతమ్మ అనే మహిళ ఒంటరిగా ఇంట్లో ఉండడాన్ని గమనించిన ఇద్దరు దుండగులు ఈనెల 3న తాము మునిసిపాలిటీవాళ్ళమంటూ ఇంట్లోకి జబర్దస్తీగా వెళ్ళారు. ఇంట్లోకి రాగానే ఇంటిపన్ను కాగితాలు చూపమన్నారు. ఆమె వారు నిజంగానే మునిసిపాల్టీ ఉద్యోగులయివుంటారనుకుని బీరువా తెరచి కాగితాలు తెచ్చి వారికి చూపించింది. ఆ హడావిడిలో బీరువాకి తాళాలు వేయడం మరచిపోయింది. ఆ తర్వాత మీ ఇంట్లో డ్రైనేజీ బాగుచేస్తామని, డ్రైనేజీ ఎక్కడుందో చూపాలని వారు ఆమెకు కల్లబొల్లి మాటలు చెప్పారు. ఆమె ఇదంతా నిజమేనని నమ్మడంతో ఇంటి వెనుక ఉన్న బావి వద్దకు వారిని తీసుకువచ్చింది. ఈ క్రమంలో దుండగుల్లో ఒకరు ఆమెను మెల్లిగా మాటల్లోకి దించగా, మరొకడు చల్లగా ఇంట్లోకి వెళ్ళి బీరువాలో ఉన్న పన్నెండున్నర సవర్ల బంగారునగలతో పాటు 5వేల రూపాయలను దోచేశాడు. ఆతర్వాత ఏమీ తెలియనట్లు దుండగులిద్దరూ ఆమెతో ఆమాటా ఈమాటా మాట్లాడుతూ కొద్దిసేపటికి అక్కడనుంచి మోటార్‌బైక్ ఎక్కి ఉడాయించారు. తీరా ఆ మహిళ ఇంట్లోకి వెళ్లి చూస్తే ఇంకేముందీ.. బీరువాలో నగలు, డబ్బు మాయం కావడంతో ఆమె జరిగిన మోసం తెలుసుకుని లబోదిబోమంటూ చిన్నబజార్ పోలీసులకు సమాచారం అందించింది. ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్‌ఐ రవి నాయక్‌లు వెంటనే వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించారు. ఆమె ఇంటిదగ్గర ఉన్న సిసి ఫుటేజీలను పరిశీలించారు. వీటి ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## జ్యోతిరావు పూలే అవార్డుకు ఎజ్రా శాస్త్రి

భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారు ప్రతి ఏటా ఇచ్చే మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు-2019కు నెల్లూరు జిల్లాకు చెందిన ఏపీయస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోవూరు ఎజ్రా శాస్త్రి ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 8న న్యూఢిల్లీలోని పంచశీల ఆశ్రమ్‌లో ప్రదానం చేయనున్నారు. ఎజ్రా శాస్త్రి దళిత,గిరిజనులతో పాటు ఇతర అణగారిన సామాజిక వర్గాల్లో సామాజిక చైతన్యంతో పాటు అక్షరాస్యతపై చైతన్య పరుస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పి సుమనాక్షర్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో..
## స్నేహ పరిమళం



మొక్కలు నాటుతున్న స్నేహపరిమళం సామాజిక సంస్థ సభ్యులు

స్నేహ పరిమళం సామాజిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2 న నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని గుడ్లూరివారి పాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వీవీ రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు పెంచాలన్నారు. సంస్థ అధ్యక్షురాలు విజయదుర్గ (వినీల) మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సాహిత్య కార్యక్రమాలతో బాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ. జయప్రకాష్, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ

10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఈనెల 1న నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుండి వీఆర్సీ డా. బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు ఎన్‌సీసీ క్యాడెట్లుతో భారీర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు నైతిక ప్రవర్తనతో మెలగాలని, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని పేర్కొన్నారు. ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఎన్.ప్రభాకర్, సబ్ లెఫ్టినెంట్ మహేష్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, విష్ణుకుమార్, పెంచలరెడ్డి, రామన్‌లు అన్నారు. విఆర్, సర్వోదయ, విడవలూరు కళాశాలలు, కెఎన్‌ఆర్, సెయింట్ పీటర్స్, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు, నేవల్ కేడెట్లు పాల్గొన్నారు.

# మద్య రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

### మద్య విమోచన కమిటీ ఛైర్మెన్ లక్ష్మణ్‌రెడ్డి

మద్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి తగు కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, మద్య నిషేధమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని మద్య విమోచన ప్రచార కమిటీ ఛైర్మెన్ వి.లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఈనెల 1న కావలిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా మద్యనిషేధం విధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 20 శాతం మద్యం దుకాణాలను తగ్గించారన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం వినియోగం 16 శాతం తగ్గిందని, మద్యం వల్ల ఎన్నో కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోయాయని, మద్యం దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేస్తూ మద్యనిషేధం కోసం మద్య విమోచన ప్రచార కమిటీ కృషిచేస్తోందని అన్నారు. ఆరుగురు ఐఏఎస్ అధికారులతో ఏర్పాటుచేసిన ఈ కమిటీకి తనను ఛైర్మెన్‌గా నియమించారని తెలిపారు. తమ కమిటీ మద్యనిషేధమే ధ్యేయంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డి.సి రాధయ్య, సాయినాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాసాచారి, జనచైతన్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ వాకర్స్‌కు అవార్డులు



గుంటూరు జిల్లా కోటప్పకొండ శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపంలో ఇటీవల జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 సదస్సులో ఉత్తమ సేవలందించినందుకు నెల్లూరుజిల్లాకు చెందిన జడ్పీ వాకర్స్ అసోసియేషన్ కు నాలుగు అవార్డులు లభించాయి. ఉత్తమ అధ్యక్షులుగా చలంచర్ల భాస్కరరెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా జేయస్ఆర్ ఆంజనేయులు, ఉత్తమ క్లబ్, అనాథ పిల్లల సేవకుగాను మొత్తం 4అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను 203 గవర్నర్ షేక్ లాల్‌వజీర్ చేతుల మీదుగా అందుకున్నారు. మండవ శ్రీనివాసరావు, మెట్టు సుధాకర్‌రెడ్డి, యంవి కృష్ణయ్య పాల్గొన్నారు.

# పంతం పట్టిన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

అయినా కాలం కలిసొచ్చే వరకు ఆగాలనుకున్నాడు. 2014 ఎన్నికల్లో చంద్రబాబుతో పొత్తు నరేంద్రమోడీకి సుతరామూ ఇష్టం లేకపోయినప్పుడు కొన్ని శక్తుల ఒత్తిడివల్ల పెట్టుకోక తప్పలేదు. ఆ తర్వాత తన పాత బుద్ధిని బయటపెట్టాడు. నోట్ల రద్దు తర్వాత దేశంలో నరేంద్ర మోడీ ఇమేజ్ పడిపోయిందనుకున్న చంద్రబాబు, తన ట్రాక్ కూడా మార్చాడు. మోడీ వ్యతిరేక స్టాండ్ తీసుకున్నాడు. మోడీని దించడమే తన జీవితాశయం అన్నట్లుగా ప్రచారం నిర్వహించాడు.

తాము తలచుకుంటే ఏం చేయగలమో నరేంద్రమోడీ, అమిత్‌షాలు మొన్న ఎన్నికల్లోనే చంద్రబాబుకు చూపించారు. ఎన్నికలలో చంద్రబాబును ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించారు.

అధికారం కోల్పోయాక నరేంద్ర మోడీతో పెట్టుకుని ఎంత పెద్ద తప్పు చేశాడో చంద్రబాబుకు తెలిసొచ్చింది. కేసుల నుండి బయటపడేందుకు, తనను తాను కాపాడుకునేందుకు చంద్రబాబు మళ్ళీ బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నాలు ప్రారంభించాడు.

కాని చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పంతంతో వున్నట్లు తెలుస్తోంది. సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డికి కూడా ఇంత పంతం లేదు. ఎందుకంటే జగన్ సిద్ధాంత ప్రాతిపదికన అది ఆచరణ సాధ్యం కాదు.

తెలుగుదేశం నుండి ఓ ఆరేడుమంది ఎమ్మెల్యేలు వెళ్లిపోతే చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదా పోతుంది. కాని అలా పార్టీ మారొచ్చిన ఎమ్మెల్యేలు వైసిపిలోకి రావాలంటే తమ పదవులకు రాజీనామాలు చేయాలి. ఒకవేళ చేసినా, వాళ్ళకు మళ్ళీ అవే సీట్లు ఇస్తారన్న గ్యారంటీపై సందేహాలు నెలకొన్నాయి. ఇక్కడే కొంత స్థబ్దత నెలకొంది. తన పార్టీలోకి వచ్చే ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాల్సిందేనన్న విషయంలో జగన్ రాజీపడడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలను తొందరగా తీసుకుని చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనే విషయంలో కేంద్రం నుండి ఒత్తిడి వున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ టీడీపీ ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తీసుకునే విషయంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆలస్యం చేస్తే బీజేపీ అధిష్టానమే రంగంలోకి దిగి టిడిపి ఎమ్మెల్యేలను తమ వైపుకు తీసుకుని బాబుకు ప్రతిపక్ష హోదాను అటకెక్కించే అవకాశాలున్నాయి.

# ప్రమాదకరంగా పవన్

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ మీడియా సైతం ఈ దారుణ ఘటనను ప్రచారం చేసింది. నిందితులకు వెంటనే ఉరిశిక్ష విధించాలంటూ దేశ వ్యాప్తంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఉదంతంపై ఎందరో కన్నీరు పెడుతున్నారు. ఇంతటి దారుణంపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఘోరాతిఘోరంగా వున్నాయి. మహిళా సంఘాలైతే చీపుర్లు పట్టుకుని అతనిని కొట్టేటట్లున్నాయి. 'దిశ'ను అత్యంత పాశవికంగా చంపిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని ఆడ మగ, పిల్ల, పెద్ద అని తేడా లేకుండా కొన్ని కోట్ల మంది నినదిస్తుంటే... పవన్ కళ్యాణ్ మాత్రం వాళ్ళకు ఉరిశిక్ష అవసరం లేదు, రెండు బెత్తం దెబ్బలు చాలంటూ ముక్తాయిస్తున్నాడు. బహుశా ఆ నలుగురు నిందితులు కూడా పవన్‌కళ్యాణ్ సినిమాలు చూసే అలా తయారయ్యారేమో! తమ ఇంటిలో ఆడపిల్లకు ఇలాగే అన్యాయం జరిగితే ఆయన ఇదే విధంగా రెండు బెత్తం దెబ్బలతో సరిపెడతాడా?

పవన్‌కళ్యాణ్ ఆడుతున్న మరో ప్రమాదకర క్రీడ మతపరమైన వివాదాలు. తిరుమలలో అన్యమత ప్రచారం హిందువుల పనేనంట... మత విద్వేషాలను రెచ్చగొట్టేది హిందూ నాయకులేనంట.. ఇప్పుడసలు ఆయనకి మతాలతో ఏం పని, మతపరమైన ప్రస్తావనలెందుకు? హిందువులపై అనవసరంగా మాట్లాడి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేత కావాల్సినంత గడ్డి పెట్టించుకున్నాడు.

రాజకీయాలలో కుల ప్రస్తావనలు ఎక్కువగా తెస్తున్నది కూడా పవనే! రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియంపై అనవసర రాద్ధాంతం చేయబోయి గబ్బు పట్టాడు. తెలంగాణలో 'దిశ' సంఘటన జరిగితే దానిని ఆంధ్రా సీఎంకు ముడిపెట్టి మాట్లాడుతున్నాడు. ఇతని మాటలు, ఇతని చేష్టలు వ్యక్తిగతమని తీసిపారేయలేము. కె.ఏ.పాల్ కంటే దారుణంగా తయారైనప్పటికీ కామెడియాక్టర్‌లే అని తోసిపుచ్చలేం, ఎందుకంటే అతనిని అభిమానించే వాళ్ళు లక్షల్లో వున్నారు. ఇతని మాటల ప్రభావం వాళ్ళ మీద పడి, రేప్ చేయడం పెద్ద తప్పుకాదులే, మా పవన్ అన్నయ్యే చెప్పాడు, రేప్ చేసినా రెండు బెత్తం దెబ్బలతో సరిపెట్టుకోవచ్చనే ఆలోచనకు వాళ్ళంతా వస్తే అది సమాజానికి ఎంత ప్రమాదకరం.. ఆలోచించండి పవన్‌కళ్యాణ్ గారూ!..

# ప్రథమ వర్ధంతి



1920 2018

మా ఇంటి దీపం.. ప్రేమానురాగాల ప్రతిరూపం

## శ్రీ ఆదాల శంకరరెడ్డి గారు

పరమపదించి తేది.07.12.2019 నాటికి

ఏడాది గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

భార్య

**ఆదాల సుశీలమ్మ**

కుమారులు

**ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

పార్లమెంటు సభ్యులు, నెల్లూరు

**ఆదాల మురళీకృష్ణారెడ్డి**

కుమార్తెలు

**గునుపాటి శ్యామల**

**బిరుదవోలు జలజ**

మనుమడు

**ఆదాల వంశీకృష్ణారెడ్డి**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com